Email:prajamantalu@gmail.com
www.prajamantalu.com

# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 4 సంచిక : 147
పేజిలు - 8 వెల - రూ 5:00
ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

గురువారం 30, నవంబర్-2023

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak,Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri

## పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది



3లో..

## నేటి తెలంగాణ ఎన్నికలపై
# సర్వత్రా ఉత్కంఠ

### బిఆర్ఎస్, కాంగ్రెస్‌ల గెలుపులపై బెట్టింగ్‌లు
### రంగంలోకి బుకీలు దిగినట్లు వార్తలు



**హైదరాబాద్,నవంబర్29** తెలంగాణ ఎన్నికలపై బెట్టింగ్ గతంలో ఎప్పుడూ లేనంతగా ఆసక్తి నెలకొంది. ఈసారి బిఆర్ఎస్ గెలుస్తుందా లేక..కాంగ్రెస్ గెలుస్తుందా అన్న ఉత్కంఠ నెలకొంది. ప్రజలు ఎవరికి ఓటేస్తారన్న ఆసక్తి కూడా నెలకొందది ఈ క్రమంలో పందాలరాయుళ్ళు రంగంలోకి దిగారు. ఈ మేరకు బెట్టింగ్ దందా జోరుగా సాగుతోంది. ఇప్పటికే కోట్లల్లో దాందా సాగినట్లు సమా చారం. గురువారం సాయంత్రం విడుదలయ్యే ఎగ్జిట్ పోల్స్ తర్వాత ఫలితాలు వెలువడే డిసెంబర్ 3వ తేదీ వరకు బెట్టింగ్ దందా కోట్లు దాటిటినా ఆశ్చర్యం లేదనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. నెల క్రితమే ఏపీలోని పలు ప్రాంతాల్లో తెలంగాణ ఎన్నికలపై బెట్టింగులు సాగుతున్నాయని అప్పట్లో వార్తలు వినిపించాయి. హైదరాబాద్ లేదా తెలంగాణలో బెట్టింగ్ నిర్వహిస్తే పట్టుబడే అవకాశం ఉందని గుర్తించిన బుకీలు.. ఇతర ప్రాంతాల నుంచి దందా సాగిస్తున్నట్లు సమాచారం. ఏపీ, ముంబై, ఢిల్లీ, కోల్‌కతతోపాటు దేశంలోని పలు ఇతర నగరాల నుంచి ఇది జరుగుతున్నట్లు తెలుస్తోంది. కొందరు బుకీలు లండన్, అమెరికాల నుంచి యాప్‌ల ద్వారా బెట్టింగులు నిర్వహిస్తున్నట్లు తెలియవచ్చింది. ముఖ్యంగా ఒక పార్టీ గెలుపుపై రెట్టింపు పందేలు జరుగుతున్నాయి. అంటే ఆ పార్టీపై రూ. లక్ష కాస్తే.. అవతలవాళ్లు రూ. 2 లక్షలు ఇవ్వాలన్నమాట. డిసెంబర్ 3న కౌంటింగ్ జరిగింతవరకు బెట్టింగులు మరింత పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. కాగా తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలకు అధికారులు సర్వం సిద్దం చేశారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ బద్రతా ఏర్పాట్లు చేశారు. ఎన్నికల విధుల్లో రాష్ట్ర పోలీసులు లక్షమంది సిబ్బందితోపాటు కేంద్ర బలగాలను కూడా రంగంలోకి దించారు. సమస్యాత్మక, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో అదనపు బలగాలను ఏర్పాటు చేశారు. తెలంగాణ ఎన్నికల విధుల్లో 375 కంపెనీల కేంద్ర బలగాలు విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 35,655 ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 4,400 సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించి అదనంగా సిబ్బందిని నియమించారు. అస్సాం రైఫిల్స్, బోర్డర్స్ సెక్యూరిటీ ఫోర్స్ , సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ , సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్, ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్, నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్ ఎన్నికల విధుల్లో ఉన్నారు. పోలింగ్ కేంద్రాలు, స్టాం÷-రగ్ రూమ్‌లను బద్రతా సిబ్బంది తమ ఆధీనంలోకి తీసుకోనున్నారు. ఇక్కడ విధులు నిర్వహించేందుకు ఇతర రాష్టాల నుంచి హోంగార్డు సిబ్బంది వచ్చారు.

# ప్రతి ఒక్కరూ ఓటు వినియోగించుకోవాలి

### తెలంగాణలో మళ్లీ బిఆర్ఎస్‌దే అధికారం
### కాంగ్రెస్, బిజెపిలకు బుద్ధి చెప్పడం ఖాయం
### మంత్రి వేముల ప్రశాంతరెడ్డి

**నిజామాబాద్,నవంబర్29 :** సీఎం కేసీఆర్ పాలనా విధానాలే తెలంగాణ ప్రజలకు శ్రీరామరక్ష అని, మరోమారు ప్రజలు తమను ఆశీర్వదిస్తారని మంత్రి వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. ప్రజల స్పందన బాగుందని అన్నారు. ప్రజలంతా తరలివచ్చి ఓటేయాలని అన్నారు. ఓటు వేయడం బాధ్యతగా తీసుకోవాలన్నారు. తెలంగాణ అస్థిత్వాన్ని కాపాడుకోవాలని అన్నారు. తెలంగాణలో నిర్మించిన ప్రాజెక్టులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రైతు ఆత్మహత్యలు లేని రాష్ట్రంగా తెలంగాణ అవతరించిందని మంత్రి వేముల ప్రశాంతరెడ్డి అన్నారు. తెలంగాణ దేశానికి అన్నం పెట్టే అన్నపూర్ణగా మారిందని అన్నారు. ఇది గమనించి తమ పీఠాలకు ఎసరు వస్తుందనే కాంగ్రెస్, బిజెపిల నేతలు ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్నారని అన్నారు. ఎన్నికల్లో ప్రజలు వీరికి గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. రానున్న రోజుల్లో బిఆర్ఎస్ పూర్తి ఆధిపత్యంతో ప్రభుత్వంలోకి వస్తుందని అన్నారు. తెలంగాణలో పదేళ్ల నాటికి, నేడు ఉన్న పరిస్థితులను ప్రజలు గమనించాలన్నారు.ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న సీఎం కేసీఆర్ వెంట ప్రజలు నిలువాలన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరిగిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలు కళ్లముందు కనిపిస్తున్నాయన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే అంధకారం అవుతుందని నాటి పాలకులు చెప్పారని గుర్తు చేశారు. వ్యవసాయానికి ఉచితంగా 24గంటలపాటు విద్యుత్ ఇస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. వస్తే కాంగ్రెసోళ్లు 3గంటల కరెంటు ఇస్తరంటా, బీజేపీ వాళ్లు మోటర్లకు మీటర్లు బిగిస్తామంటున్నారని తెలిపారు. మోటర్లకు మీటర్లు పెడితే తెలంగాణకు రూ.25వేల కోట్లు ఇస్తామని కేంద్రం చెప్పినా సీఎం కేసీఆర్ పట్టించుకోకుండా రైతులకు ఉచిత కరెంట్ అందిస్తున్నారని చెప్పారు. సీఎం కేసీఆర్ కాళేశ్వరం నిర్మించి లక్షలాది ఎకరాలకు సాగునీరు అందిస్తున్నారన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ దేశానికి దిక్సూచిగా నిలిచిందన్నారు. కాంగ్రెస్ 60ఏండ్లు పరిపాలించి నప్పటికీ నేటి ఎందుకు చేయలేదో ప్రజలకు చెప్పాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అరచేతిలో వైకుంఠం చూపుతోందన్నారు. సీఎం కేసీఆర్ మరోసారి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఇతర రాష్టాల్లో లేవని మంత్రి అన్నారు. 60 ఏండ్లు పరిపాలించిన కాంగ్రెస్ చేయలేని అభివృద్ధి ఇప్పుడు ఎట్ల చేస్తదో ప్రజలు ప్రశ్నించాలన్నారు. ఆసరా పింఛన్లతోపాటు కల్యాణలక్ష్మి, షాదీముబారక్, మిషన్ భగీరథ తదితర పథకాలను సీఎం కేసీఆర్ వచ్చాకే అమలమయ్యాయన్నారు. అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి అండగా ఉండాలన్నారు.

## ద్వేషపూరిత ప్రసంగాల కేసుపై నాలుగు రాష్ట్రాలకు
# సుప్రీం నోటీసులు

### నోడల్ అధికారులను నియమించారా అని సూటి ప్రశ్న



న్యూఢిల్లీ,నవంబర్29 : దేశవ్యాప్తంగా పెరుగుతున్న ద్వేషపూరిత ప్రసంగాల కేసులపై సుప్రీంకోర్టు బుధవారం నాలుగు రాష్ట్రాలకు నోటీసులు జారీ చేసింది. నోడల్ అధికారులను నియమించారా లేదా అని చెప్పాలని రాష్ట్రాలను సుప్రీంకోర్టు కోరింది. నోటీసులు జారీ చేసిన రాష్ట్రాలలో గుజరాత్, కేరళ, నాగాలాండ్, తమిళనాడు ఉన్నాయి. సుప్రీంకోర్టులో ఈ కేసు తదుపరి విచారణ 5 ఫిబ్రవరి 2024న జరగనుంది. కేంద్ర ప్రభుత్వం స్టేటస్ రిపోర్టు దాఖలు చేసి 28 రాష్ట్రాలు నోడల్ అధికారులను నియమించినట్లు తెలిపింది. గుజరాత్, కేరళ, నాగాలాండ్, పశ్చిమ బెంగాల్ రాష్టాలు ఇంకా తమ సమాధానాన్ని దాఖలు చేయలేదని ఏఎస్జీ కేఎం నటరాజన్ కోర్టుకు తెలిపారు. నోడల్ అధికారుల నియామకానికి సంబంధించి కూడా ఎలాంటి సమాచారం లేదు. ఎన్ని రాష్ట్రాలు తమ సమాధానాలను దాఖలు చేశాయని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. నోడల్ అధికారిని నియమించినట్లు బెంగాల్ ప్రభుత్వం కోర్టుకు తెలిపింది. అక్టోబర్ 11న హెూంశాఖ కార్యదర్శి అన్ని రాష్ట్రాల సమావేశాన్ని పిలిచి తీసుకోవాల్సిన చర్యలు, సమ్మతి నివేదికలు సమర్పించాల్సిన ఆవశ్యకత గురించి తెలియజేసినట్లు ఏఎస్జీ తెలిపారు. రాష్ట్రాలకు నోటీసులు జారీ చేస్తామని జస్టిస్ సంజీవ్ ఖన్నా తెలిపారు. నోడల్ అధికారిని నియమించారా లేదా అని రాష్ట్రం తెలియజేయాలి వ్యక్తిగత విషయాలతో వ్యవహరించలేను జస్టిస్ ఖన్నా పిటిషనర్ తరఫు న్యాయవాది నిజాం పాషా మాట్లాడుతూ.. ఎవరైనా విద్వేషపూరిత ప్రసంగం చేస్తే మళ్లీ సమావేశాల్లో ప్రసంగించేందుకు అనుమతిస్తామని తెలిపారు. వ్యక్తిగత కేసులను మేము పరిష్కరించలేమని, మీరు సంబంధిత హైకోర్టును ఆశ్రయించవచ్చని జస్టిస్ ఖన్నా అన్నారు. జూలై 7, 2018న, ద్వేషపూరిత ప్రసంగాలను నిషేధించాలని కోర్టు మార్గదర్శకాలను జారీ చేసింది. ద్వేషపూరిత ప్రసంగాన్ని తీవ్రమైన నేరంగా సుప్రీంకోర్టు పేర్కొన్న సంగతి తెలిసిందే. దేశ వ్యాప్తంగా జరుగుతున్న ద్వేషపూరిత ప్రసంగాలకు సంబంధించి సుప్రీంకోర్టు ఒక ప్రకటనలో రాజకీయాలు, మతాలు విడిపోయే రోజు ద్వేషపూరిత ప్రసంగాలు నిలిచిపోతాయని పేర్కొంది.

# ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేద్దాం

### కేంద్ర మంత్రి, బీజేపీ స్టేట్ చీఫ్ కిషన్ రెడ్డి



**హైదరాబాద్,నవంబర్29 :** తెలంగాణలో గురువారం జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు ప్రలోభాలకు లొంగకుండా.. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించుకోవాలని కేంద్ర మంత్రి, బీజేపీ స్టేట్ చీఫ్ జి కిషన్ రెడ్డి కోరారు. ఇప్పటికే నాలుగు రాష్ట్రాల ఎన్నికలు అయిపోయాయని, తెలంగాణలో ఎన్నికలు ప్రశాంతంగా జరగాలని అమ్మవారిని కోరుకున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్‌లోని చార్మినార్‌ను వద్దనున్న భాగ్యలక్ష్మి అమ్మవారిని ఈరోజు కిషన్ రెడ్డి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి దర్శనం అనంతరం కిషన్ రెడ్డి మాట్లాడుతూ 'దేశ ప్రజలు ఎంతో ఉత్కంఠతో ఎదురుచూస్తున్న 41 మంది కార్మికులు సొరంగం నుంచి 17 రోజుల తర్వాత సురక్షితంగా బయటకు వచ్చారు. ఇది నిజంగా గొప్ప విషయం. వాళ్లు ధైర్యంగా బయటకు వచ్చినందుకు అమ్మవారికి ఈరోజు ప్రార్థనలు చేశాను. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు చర్చలు జరిపి.. కార్మికులను బయటకు తీసుకురావడం గొప్ప విషయం' అని అన్నారు. 'ఇప్పటికే నాలుగు రాష్ట్రాల్లో ఎన్నికలు ముగిసాయి. తెలంగాణలో గురువారం ఎన్నికలు ప్రశాంతంగా జరగాలి. ప్రజలెవరూ డబ్బులు సహా ఇతర ప్రలోభాలకు లొంగకుండా.. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి. రాష్ట్ర ప్రజలు, దేశ ప్రజల మీద భాగ్యలక్ష్మి అమ్మవారి ఆశీస్సులు ఉండాలని అమ్మవారిని ప్రార్థించాను. తెలంగాణ రాష్ట్రం అవినీతి రహిత, ప్రజాస్వామ్యయుత రాష్ట్రంగా వెల్లివిరియాలని అమ్మవారిని కోరుకున్నా' అని కిషన్? రెడ్డి వెల్లడించారు.

## నేడే తెలంగాణలో
# అసెంబ్లీ ఎన్నికలు

- భారీగా ఏర్పాట్లు చేసిన అధికారులు
- పోలింగ్ కేంద్రాల వద్ద భారీ భద్రత
- డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద పోలింగ్ సామాగ్రి అందచేత
- పోలింగ్ సామాన్లతో కేంద్రాలకు చేరుకున్న సిబ్బంది
- ఉదయం మాక్ పోలింగ్ ..తరవాత పోలింగ్‌కు అనుమతి
- పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు



**హైదరాబాద్,నవంబర్29 :** ప్రత్యేక తెలంగాణలో మూడోసారి ఎన్నికలు జరుగబోతున్నాయి. గురువారం జరిగే అసెంబ్లీ ఎన్నికలు ఒకేదఫాలో జరుగనున్నాయి. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటలవరకు పోలింగ్ జరుగనుంది. మొత్తం 119 అసెంబ్లీ స్థానాలో పోలింగ్ జరుగునుండా... అసెంబ్లీ ఎన్నికలకు అధికారులు సర్వం సిద్దం చేశారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా భారీ బద్రతా ఏర్పాట్లు చేశారు. ఎన్నికల విధుల్లో రాష్ట్ర పోలీసులు లక్షమంది సిబ్బందితోపాటు కేంద్ర బలగాలను కూడా రంగం లోకి దించారు. సమస్యాత్మక, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో అదనపు బలగాలను ఏర్పాటు చేశారు. తెలంగాణ ఎన్నికల విధుల్లో 375 కంపెనీల కేంద్ర బలగాలు విధులు నిర్వహిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 35,655 ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 4,400 సమస్యాత్మక ప్రాంతాలుగా గుర్తించి అదనంగా సిబ్బందిని నియమించారు. అస్సాం రైఫిల్స్, బోర్డర్స్ సెక్యూరిటీ ఫోర్స్,సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ , సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్, ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్, నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్ ఎన్నికల విధుల్లో ఉన్నారు. పోలింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లను బద్రతా సిబ్బంది తమ ఆధీనంలోకి తీసుకోనున్నారు. ఇక్కడ విధులు నిర్వహించేందుకు ఇతర రాష్ట్రాట నుంచి హోంగార్డు సిబ్బంది వచ్చారు.కాగా ఇప్పటికే ఎన్నికలు బహిష్కరణకు మావోయిస్టు పార్టీ పిలుపునిచ్చింది. దీంతో ఏజన్సీ ప్రాంతాల్లో భద్రత మరింత కట్టుదిట్టం చేశారు. కేంద్ర బాలగాలు ఏజెన్సీ ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 144 సెక్షన్ విధించారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుంది. మద్యం, డబ్బులు పంపిణిపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. అలాగే సిసిటీవీ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. తెలంగాణలో పోలింగ్‌కు సర్వం సన్నద్ధం కాగా పోలింగ్ సామాగ్రిని తీసుకుని అధికారులు తమకు కేటాయించిన కేంద్రాలకు ప్రత్యే వాహనాల్లో వెళ్లారు. దీని కోసం ప్రతి నియోజకవర్గానికి ఒక డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. అక్కడికే సిబ్బంది చేరుకొని తమకు కేటాయించిన సామగ్రిని కలెక్ట్ చేసుకుని బయలుదేరారు.ఎన్నికల విధులకు హాజరయ్యే ప్రభుత్వ ఉద్యోగులు తమ ఓటు హక్కును ఫెసిలిటీ సెంటర్‌లో కూడా వినియోగించుకోవచ్చని అధికారులు తెలిపారు. అక్కడే ఎన్నికల సామగ్రి కలెక్ట్ చేసుకొని అక్కడి నుంచి ఏర్పాటు చేసిన వెహికల్స్‌లో పోలింగ్ కేంద్రాలకు చేరుకోనున్నారు. ఎన్నికల సామగ్రి, సిబ్బందిని చేరవేసేందుకు ఉంచిన వాహనాలకు ముందే రూట్ మ్యాప్ ఇచ్చారు. ఆ ప్రకారమే వెహికల్స్ మూమెంట్ ఉంటుంది. వేరే దారిలో వెళ్లే పరిస్థితి ఉండకూదు. మార్గ మధ్యలో ఆప కూడదని కూడా ఆదేశాలు ఉన్నాయి. వాటికి జీపీఎస్ ట్రాకింగ్ ఉంటుందని ఏ జరుగుతుందో స్పష్టంగాెలిసిపోతుందని ఏదైనా సమస్య ఉంటే వెంటనే అధికారులు అక్కడకు చేరుకుంటా రని పేర్కొన్నారు. గురువారం ఉదయం ఐదున్నరకే మాక్ పోలింగ్ నిర్వహించనున్నారు. ఆటైంకు అభ్యర్థుల ఏజెంట్లు పోలింగ్ కేంద్రంలో ఉండాలని అధికారులు ఆదేశించారు. పోలింగ్ ఏజెం ట్లు ఈవీఎంలను టచ్ చేయడానికి వీల్లేదని స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. అందరి సమక్షంలో మాక్ పోలింగ్ జరిగిన తర్వాత ఉదయం ఏడు గంటలకు సాధారణ పోలింగ్ పక్రియ మొదలు కానుంది. గురువారం ఉదయం 7 నుంచి సాయంత్రం ఐదు వరకు పోలింగ్ జరగనుంది. నక్సల్స్ ప్రభావిత 13 నియోజక వర్గాల్లో మాత్రం సాయంత్రం 4 గంటలకు పోలింగ్ ముగిస్తారు మిగతా ప్రాంతాల్లో ఐదు గంటల వరకు పోలింగ్ పక్రియ కొనసాగనుంది. ఐదు గంటల వరకు క్యూలైన్‌లో ఉన్న వారికి ఓటు వేసుకునే హక్కు ఉంటుంది. పోలింగ్ కోసం ఎన్నికల సంఘం ఈసారి విస్తృత ఏర్పాట్లు చేసింది. తెలంగాణ వ్యాప్తంగా 35,655 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. అక్కడ దివ్యాంగుల కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంది. వారు ఓటు వేసి వెళ్లేందుకు వీలుగా 21 ,686 వీల్‌ఛైర్లు ఏర్పాటు చేసింది. 80 ఏళ్లుపైబడిన వారికి ఉచిత రవాణా సదుపాయం కూడా కల్పిస్తోంది. ఓటరు స్లిప్పులు, నమూనా బ్యాలెట్లు పంపిణీ చేసింది. దివ్యాంగుల కోసం బ్రెయిలీ లిపి ఉన్న ఓటరు స్లిప్‌లను పంపిణీ చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 644 మోడల్ పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఇందులో 120పైగా కేంద్రాలను దివ్యాంగులే నిర్వహించనున్నారు. మరో ఆరువందల కేంద్రాలను మహిళలు నిర్వహించనున్నారు. ఎన్నికల కోసం 375 కంపెనీల సాయుధ బలగాలు, 50వేల మంది స్థానిక పోలీసులను ఎన్నికల సంఘ వినియోగిస్తోంది. ఓటరు స్లిప్‌లను మాత్రం గుర్తింపు కార్డుగా పరిగణలోకి తీసుకోమని... ఓటరు ఐడీ కానీ వేరే ఇతర 12 రకాల ఐడీలు కానీ ఉండాలని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. ఓటరు స్లిప్పులపై ఎలాంటి గుర్తులు ఉండటానికి వీల్లేదని చెప్పింది. అలాంటి వాటిని మాత్రమే పోలింగ్ కేంద్రంలోకి అనుమతి ఇస్తామని లేకుంటే తిరస్కరిస్తామని పేర్కొంది. ఓటు వేసేందుకు వచ్చిన వాళ్లు ఎవరూ ఫోన్లు తీసుకురావద్దని అధికారులు సూచిస్తున్నారు. ఓట్లు వేసినప్పుడు సెల్ఫీలు, ఇతర ఫొటోలు తీయడానికి కూడా వీల్లేదని చెబుతున్నారు. అలాంటి ప్రయత్నాలు చేసిన వాళ్లు కచ్చితంగా శిక్షార్హులు అవుతారని హెచ్చరిస్తున్నారు.

## ప్రజానాడి




## నేటి పోలింగ్‌పై నేతల నజర్

- బూత్‌స్థాయి కార్యకర్తలతో నేతల సమీక్ష
- ఎక్కువ మందిని ఓటుకు తీసుకుని వచ్చేలా ప్లాన్
- గతానికి భిన్నంగా అన్ని పార్టీల నేతల ప్రచారం



## స్పైస్‌జెట్ విమానంలో సాంకేతిక లోపం

### అర్థాంతరగా రద్దు..ప్రయాణికుల ఆందోళన

**హైదరాబాద్,నవంబర్29 :** హైదరాబాద్ నుంచి ఢిల్లీ వెళ్లాల్సిన స్పైస్ జెట్ విమానంలో బుధవారం ఉదయం సాంకేతిక లోపం తలెత్తడంతో అధికారులు రద్దు చేశారు. విమానాన్ని అర్థంతరంగా రద్దు చేయడంతో 160 మంది ప్రయాణికులు శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ఆందోళనకు దిగారు. ఆలస్యంగా స్పందించిన ఎయిర్ లైన్స్ ప్రతినిధులు బుధవారం మధ్యాహ్నం 12.30 గంటలకు మరో విమానంలో పంపించేందుకు ఏర్పాట్లు చేశామని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు. ప్రయాణాన్ని రద్దు చేసుకున్న ప్రయాణికులకు పూర్తి స్థాయిలో టికెట్ డబ్బును వెనక్కి ఇవ్వనున్నట్లు ఎయిర్‌పోర్టు అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

## కౌశిక్ వ్యాఖ్యలపై విచారణకు ఇసి ఆదేశం

**హైదరాబాద్,నవంబర్29 :**హుజురాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్ రెడ్డి మంగళవారం చేసిన వ్యాఖ్యలపై ఈసీ విచారణకు ఆదేశించింది. కౌశిక్ రెడ్డి వ్యాఖ్యలపై ఎన్నికల సంఘం నివేదిక కోరింది.విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని హుజురాబాద్ ఎన్నికలఅధికారులను ఈసీ బుధ వారం ఆదేశించింది. కౌశిక్ రెడ్డి ప్రచారం ముగింపు రోజు వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన విష యం తెలిసిందే.తనను గెలిపించకపోతేభార్య,బిడ్డతోకలిసి ఉరేసుకుంటానన్నారు. గెలిస్తే విజయ యాత్ర, లేదంటే డిసెంబర్ 4న తన శవయాత్ర అంటూ ఓటర్లను ప్రభావితం చేసేలా కామెంట్స్ చేశారు.

## బిర్లామందిర్‌కు బృందంగా కాంగ్రెస్ నేతలు

### ఐదుగురినే వెళ్లాలని సూచించిన పోలీసులు

**హైదరాబాద్,నవంబర్29 :** బిర్లా మందిర్‌కు బృందంగా బయలుదేరిన కాంగ్రెస్ నేతలను పోలీసులు అడ్డుకున్నారు. బుధవారం ఉదయం గాంధీభవన్ నుంచి టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి, ఇంఛార్జి ఠాక్రే, అంజన్ కుమార్ యాదవ్ , వీహెచ్ పలువురు నేతలు బిర్లా టెంపుల్‌కు బయలుదేరారు. అయితే గాంధీభవన్ ముందు కాంగ్రెస్ నేతలను పోలీసులు అడ్డుకున్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఐదుగురు మాత్రమే వెళ్లాలని పోలీసులు సూచించారు. దీంతో పోలీసుల సూచనల మేరకు కేవలం రేవంత్, ఠాక్రే, అంజన్ కుమార్ యాదవ్, మల్లు రవి మాత్రమే బిర్లామందిర్‌కు వెళ్లారు. బిర్లా టెంపుల్‌లో శ్రీ వేంకటేశ్వర స్వామికి కాంగ్రెస్ నేతలు ప్రత్యేక పూజలు చేశారు. వేంకటేశ్వర స్వామి ముందు కాంగ్రెస్ గ్యారెంటీ కార్డు పెట్టి మరీ రేవంత్ రెడ్డి పూజలు చేశారు.

## తెలంగాణ భవన్‌లో దీక్షాదివస్‌కు అభ్యంతరం

### రక్తదానంతో సరిపెట్టుకున్న బిఆర్ఎస్ నేతలు

**హైదరాబాద్,నవంబర్29 :** బీఆర్ఎస్ పార్టీకి నిరాశ ఎదురైంది. దీక్షా దివస్‌కు పోలీస్ అధికారులు అనుమతి నిరాకరించారు. పోలీస్ కమిషనర్‌తో ఫోన్‌లో మాట్లాడిన బీఆర్ఎస్ నేత శంబీపూర్ రాజు, లీగల్ సెల్ నేత సోమ భరత్ పాల్గొననున్నారు. బీఆర్ఎస్ దీక్ష దివస్‌కు అనుమతి లేదని సీపీ తేల్చి చెప్పారు. కేటీఆర్ వచ్చి పార్టీ కార్యాలయంలో కూర్చుంటే సీపీ అభ్యంతరం లేదని చెప్పారు. ఎన్నికల కోడ్, 144 సెక్షన్ అమలులో ఉన్నందున దీక్ష దివస్ చేయొద్దని పోలీసులు తేల్చి చెప్పారు. తెలంగాణ భవన్‌లో కేటీఆర్ లేకుండానే రక్త దాన శిబిరం స్టార్ట్ చేశారు. తరవాత తెలంగాణ భవన్‌కు కేటీఆర్ వచ్చారు. రక్త దాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం స్వయంగా రక్త దానం చేశారు. కాగా, అంతకు ముందు బీఆర్ఎస్ భవన్‌కు చేరుకున్న కేటీఆర్‌కు తెలంగాణ భవన్‌లో దీక్షా దివస్ చేపట్టవద్దని ఎన్నికల స్క్వాడ్ అభ్యంతరం తెలిపింది. ప్రచారం గుడువు ముగిసినందున పార్టీ కార్యాలయాల్లో ఎలాంటి కార్యక్రమాలు చేపట్టవద్దని సూచించింది. అయితే దీక్షా దివస్ ఎన్నికల కార్యక్రమం కాదని బీఆర్ఎస్ నేతలు తెలిపారు. తెలంగాణ భవన్‌లో రక్తదాన శిబిరం నిర్వహిస్తామని తెలుపడంతో అందుకు ఎన్నికల అధికారులు అంగీకరించారు. దీంతో పెద్ద ఎత్తున కేటీఆర్‌తో పాటు బీఆర్ఎస్ శ్రేణులు రక్తదానం చేశారు.

## ఇసి ఆదేశాలు బేఖాతర్

### సెలవులు ఇవ్వని సంస్థలపై ఫిర్యాదులు

**హైదరాబాద్,నవంబర్29 :** తెలంగాణ వ్యాప్తంగా నవంబర్ 30న గురువారం ఎన్నికలు జరుగ నున్నాయి. ఈ నేపథ్యంలో విద్యాసంస్థలకు, ప్రైవేటు సంస్థలకు ఇప్పటికే సెలవులు ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే ఈసీ సెలవు ప్రకటించినప్పటికీ పలు సంస్థలు, కళాశాలలు పట్టించుకోని పరిస్థితి. ఈ క్రమంలో రేపు సెలవు ఇవ్వడం లేదని ఎలక్షన్ కమిషన్‌కు అనేక ఫిర్యాదులు వచ్చి చేరాయి. దాదాపు 1950కు పైగా పలు ప్రైవేట్ సంస్థలు, కళాశాలల నుంచి వరుస ఫిర్యాదులు వచ్చాయి. స్థానిక అధికారులకు చెప్పినా ఫలితం లేకపోవడంతో స్టేట్ ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. ప్రభుత్వ, ప్రైవేట్ సెలవు ఇవ్వాలని ఎలక్షన్ కమిషన్ ఇప్పటికే ఆదేశాలు జారీ చేసింది. దీంతో తమ ఆదేశాలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని ఈసీ హెచ్చరికలు జారీ చేసింది.

## శంషాబాద్ లో భారీ అగ్ని ప్రమాదం

### థర్మకోల్ తయారీ పరిశ్రమలో చెలర్రేగిన మంటలు

**హైదరాబాద్,నవంబర్29 :** రంగారెడ్డి జిల్లాలో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఓ థర్మకోల్ తయారీ పరిశ్రమలో మంటలు దట్టంగా వచ్చాయి. దీంతో సిబ్బంది అప్రమత్తమయి.. మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లాలోని రాజేంద్రనగర్ శంషాబాద్ గగన్‌పహాడ్ పారిశ్రామిక వాడలో ఉన్న థర్మకోల్ తయారీ పరిశ్రమలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. థర్మకోల్ పరిశ్రమలో వెల్డింగ్ పనులు చేస్తుండగా.. విద్యుత్ తీగల నుంచి థర్మకోల్ షీట్లకు మంటలు అంటుకున్నాయి. దీంతో ఫ్యాక్టరీ చుట్టూ దట్టమైన పొగ కమ్ముకుంది. ఈ విషయం స్థానికుల ద్వారా తెలుసుకున్న డీఆర్ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలాన్ని చేరుకున్నారు. అనంతరం మంటలు అదుపు చేశారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణ నష్టం లేదని అధికారులు తెలిపారు. సుమారు రూ.2 కోట్ల వరకు ఆస్తి నష్టం జరిగి ఉండవచ్చని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని.. దర్యాప్తు చేస్తున్నారు.

## సీఏఏ అమలును ఎవరూ ఆపలేరు

### మరోసారి స్పష్టం చేసిన అమిత్ షా



**కోల్‌కతా,నవంబర్29 :** కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన పౌరసత్వ సవరణ చట్టం( సిటిజన్‌షిప్ అమెండ్మెంట్ యాక్ట్)(సీఏఏ) అమలును ఎవరూ ఆపలేరని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తేల్చి చెప్పారు. బీజేపీ లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా అమిత్ షా పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలో ఏర్పాటు చేసిన ర్యాలీలో పాల్గొన్నారు. సీఎం మమతాబెనర్జీ బుజ్జగింపు, చొరబాట్లు, అవినీతి, రాజకీయ హింసకు పాల్పడుతోందిన ఆరోపించారు. తృణమూల్ కాంగ్రెస్(టీఎంసీ) ప్రభుత్వాన్ని గద్దె దించి రాష్ట్రంలో బీజేపీని ఎన్నుకోవాలని ప్రజలను కోరారు. ర్యాలీకి భారీకి తరలివచ్చిన ప్రజలను ప్రశంసిస్తూ.. ఇది ప్రజల ఆలోచనల్ని తెలియజేస్తుందని, 2026లో రాష్ట్రంలో మూడింట రెండొంతుల మెజారిటీలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ ప్రదర్శనే బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయానికి పునాది వేస్తుందని అమిత్ షా అన్నారు. సీఏఏ అమలును మమతా బెనర్జీ వ్యతిరేకిస్తున్నారని, దాన్ని ఎవరూ ఆపలేరని, కేంద్ర ప్రభుత్వం ఇంకా తన నిబంధనలను రూపొందిచనందున ఇది సందిగ్ధంలో ఉందని వెల్లడించారు. అయితే సీఏఏను కాంగ్రెస్‌తో సహా టీఎంసీ వంటి చాలా పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. బెంగాల్ అసెంబ్లీలో ప్రస్తుతం బీజేపీ ప్రతిపక్షంగా ఉంది. 2019లో లోక్‌సభ ఎన్నిల్లో బీజేపీ 42 స్థానాలకు గానూ 18 ఎంపీ స్థానాలను కైవసం చేసుకుంది.

# పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది

- ఉదయం నుంచే పోలింగ్ సామాగ్రి అందచేత
- పత్యేక వాహనాల్లో తరలివెళ్లిన సిబ్బంది
- పలు కేంద్రాలను సందర్శించిన వికాస్ రాజ్

**హైదరాబాద్,నవంబర్29 :** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఏర్పాట్లు దాదాపుగా పూర్తి కావచ్చాయి. గురువారం పోలింగ్ జరుగనుండటంతో అధికారులు ఏర్పాట్లలో బిజీబిజీగా ఉన్నారు. పోలింగ్ సిబ్బందికి ఎన్నికల సామాగ్రి పంపిణీ ప్రక్రియను ఉదయం నుంచే ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా సిబ్బంది ఇప్పటికే డీఆర్సీ కేంద్రాలకు చేరుకోగా వారికి అధికారులు ఈవీఎంలు, ఇతర సామాగ్రిని అందజేసారు. సామాగ్రిని తీసుకుని సాయంత్రం లోగా సిబ్బంది తమతమ పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. గురువారంఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ జరుగ నుంది. దాదాపు 1.85 లక్షల మంది సిబ్బంది ఎన్నికల విధుల్లో పాల్గొననున్నారు. కాగా, పోలింగ్ కోసం రాష్ట్రవ్యాప్తంగా 19,375 ప్రాంతాల్లో మొత్తం 35,356 పోలింగ్ కేంద్రాల ఏర్పాటు చేశారు. అందులో 27,094 పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్‌కు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. పోలింగ్ కేంద్రాల పరిశీలన కోసం 22 వేల మంది మైక్రో అబ్జర్వర్‌లను, స్క్వాడ్‌లను నియమించారు. అదేవిధంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ రాష్ట్రంలోని అన్ని డీఆర్సీ కేంద్రాలను సందర్శించారు. ఎన్నికల సామాగ్రి పంపిణీని పరిశీలించారు. మరోవైపు కలెక్టర్ అనుదీప్ హైదరాబాద్ పరిధిలోని డీఆర్సీ కేంద్రాలను సందర్శించారు. కాగా, రాష్ట్రంలోని మొత్తం 119 నియోజకవర్గాలకు ఒకే విడతలో పోలింగ్ నిర్వహిస్తున్నారు. మొత్తం 2,290 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలు ప్రధాన పార్టీలుగా ఉన్నాయి.కాగా, ఎన్నికల భద్రతా విధుల కోసం రాష్ట్ర పోలీసులతోపాటు కేంద్ర బలగాలను కూడా అధికారులు రంగంలోకి దించారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల దగ్గర భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఇప్పటికే



మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మిజోరం లలో పోలింగ్ పూర్తయ్యింది. గురువారంతో తెలంగాణలో కూడా పోలింగ్ ముగియనుంది. అన్ని రాష్ట్రాల్లో ఒకేసారి డిసెంబర్ 3న ఓట్లను లెక్కించి ఫలితాలను వెలువరించనున్నారు.

# కిటకిటలాడుతున్న బస్టాండులు

### ఓటు వేసేందుకు సొంతూళ్ల బాట పట్టిన ఓటర్లు

**హైదరాబాద్,నవంబర్29 :** రాష్ట్రంలో ఐదేళ్లకొకసారి వచ్చే ఎన్నికలలో భాగంగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి రెడీ అవుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా హైదరాబాద్ వంటి నగరాలలోనూ, ఇతర ప్రాంతాలలోనూ ఉన్న ఓటర్లు కూడా తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి సొంతూళ్లకు పయనమయ్యారు. ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి, అక్కడ జీవనం సాగిస్తున్న చాలా మంది ఓటర్లు.. తమ ఓటు హక్కను వినియోగించుకునేందుకు వచ్చేస్తున్నారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బస్ స్టాండ్‌లు ఎక్కడికక్కడ కిక్కిరిసిపోతున్నాయి. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వేసేందుకు రాష్ట్ర ప్రజలు సిటీ నుంచి సొంతూళ్ల బాట పట్టారు. వివిధ జిల్లాలకు వెళ్లేవారు ఒకరోజు ముందుగానే సొంతూళ్లకు బయలుదేరారు. రాష్ట్రంలో పోలింగ్ సందర్భంగా విద్యాసంస్థలకు నేడు, రేపు రెండు రోజులు ప్రభుత్వం సెలవులు ఇచ్చింది. దీంతో మంగళవారం సాయంత్రం నుంచే రాష్ట్రంలో ఎక్కడ చూసినా కుటుంబాలతో వెళుతుండగా బస్ స్టాండ్‌లలో రద్దీ కనిపిస్తోంది. అలాగే గత రెండు మూడు రోజులుగా అడ్డాలపై కూలీలు కూడా పెద్దగా కనిపించడం లేదు. పనుల కోసం వలస వెళ్లిన ఓటర్లను సొంతూళ్లకు రావాలని ఇప్పటికే అన్ని పార్టీల అభ్యర్థులు కుటుంబ సభ్యులను కోరారు. కొద్దిరోజులుగా అభ్యర్థులు కూడా సిటీకి వచ్చి తమ సెగ్మెంట్లలోని ఓటర్లతోనూ ఆత్మీయ సమ్మేళనాలు సైతం నిర్వహించిన విషయం తెలిసిందే. సొంతూళ్లో ఓటు ఉన్నవాళ్లు తప్పకుండా వచ్చి ఓటు హక్కును వినియోగించుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. అందుకోసం రవాణా సదూపాయం కూడా ఏర్పాటు చేస్తున్నారు. హైదరాబాద్ సిటీలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలకు చెందిన ఓటర్లు నివసిస్తుంటారు. ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాలకు చెందిన వారు ఎక్కువగా ఎల్బీనగర్, సాగర్ రింగ్ రోడ్, దిల్‌సుఖ్‌నగర్, బీఎన్‌రెడ్డి నగర్ ప్రాంతాల్లో ఉంటున్నారు. అలాగే ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాలకు చెందిన వారు మెహిదీపట్నం వైపు, వరంగల్, కరీంనగర్, నిజామాబాద్ జిల్లాల వారు ఎల్బీనగర్, ఉప్పల్ వైపు.. మెదక్, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన వారు



లింగంపల్లి, బాలానగర్, బోయిన్ పల్లి, సికింద్రాబాద్ తదితర ప్రాంతాల్లో నివాసం ఉంటున్నారు. న్నికల్లో గెలుపే లక్ష్యంగా అభ్యర్థులు ఈసారి వలస ఓటర్లపై దృష్టి పెట్టారు. ఓటర్లకు డైలీ ఫోన్లు చేసి మరీ ఎప్పుడొస్తున్నారని ఆయా పార్టీల లోకల్ లీడర్లు ఆరా తీస్తున్నారు. దీనికి సంబంధించి కూడా కుటుంబ సభ్యులను కూడా అడుగుతున్నారు. పోలింగ్ రోజు వచ్చేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తామని ఓటర్లకు సైతం భరోసా ఇస్తున్నారు. ఇప్పటికే ప్రధాన రాజకీయ పార్టీలకు చెందిన కొందరు.. వలస ఓటర్లను తరలించే పనిలో నిమగ్నమయ్యారు. అంతా సొంతూళ్లకు బయలుదేరడంతో ఎంజీబీఎస్, జూబ్లీ బస్ స్టేషన్లు కిక్కిరిసిపోయాయి. అన్ని బస్సుల్లో సీట్లు దొరకడం లేదు. చాలామంది ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. దీంతో పెరిగిన రద్దీ సాకుతో ఛార్జీలు అమాంతం పెంచేశారు.కాగా సొంతూళ్లకు పోయే వాళ్లంతా ఓటు హక్కును వినియోగించుకునేందుకు వెళితే మంచిదే. కానీ ఇక్కడ ఓటు హక్కును కలిగి ఉండి రెండు రోజులు సెలవు వచ్చిందని ఓటు హక్కును వినియోగించుకోకుండా విహార యాత్రలకు వెళితే మాత్రం ప్రజాస్వామ్యం మనకు కల్పించిన హక్కును కొల్పోతాం. ప్రజాస్వామ్యంలో ఓటు విలువ ఇంకా తెలియక పోవడం శోచనీయం భావించాలి. మొత్తానికి తరలి వస్తున్న ఓటర్లతో పట్టణాల్లో, గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. మరోవైపు అభ్యర్థులు ఏర్పాటు చేస్తున్న విందులు, వినోదాలతో సందడిగా ఉంది.

## క్యూ లైన్ వివరాలు తెలుసుకునేందుకు వినూత్న చర్యలు

### జీహెచ్ఎంసీ యాప్ ద్వారా వివరాలు తెలుసుకునే అవకాశం

**హైదరాబాద్,నవంబర్29 :** హైదరాబాద్ జిల్లాలో మొట్ట మొదటి సారిగా పోలింగ్ కేంద్రాల దగ్గర ఓటు వేసే క్యూ లైన్ వివరాలు తెలుసుకునేందుకు జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్ వినూత్న చర్యలు చేపట్టారు. జిల్లాలో ప్రతి ఒక్కరూ ఓటు వేయాలనే ఉద్దేశ్యంతో పోలింగ్ కేంద్రాల దగ్గర క్యూ లైన్ తెలుసుకునేందుకు పోల్ క్యూ రూట్ యాప్ ద్వారా తెలుసుకోవచ్చును.. జీహెచ్ఎంసీ వెబ్ సైట్.. మై జీహెచ్ఎంసీ యాప్ లలో యాప్ ను ఆక్టివేట్ చేశారు. అయితే, ముందుగా జీహెచ్ఎంసీ వెబ్ సైట్ లో వెళ్ళిన తర్వాత పోల్ క్యూ లైన్ నీ సెలెక్ట్ చేసుకోవాలి.. ఆ తర్వాత నియోజక వర్గం పేరు పోలింగ్ స్టేషన్ పేరు నమోదు చేసిన తర్వాత పోలింగ్ కేంద్రం ఎక్కడ ఉందో నేవియేషన్ చూపిస్తుంది.. అయితే, ఎంత మంది క్యూ లైన్ లో వేచి ఉన్నారో చూపిస్తుంది.. వెయిటింగ్ టైం కూడా చూపిస్తుంది.. ఈ క్యూ లైన్ సెక్టర్ ఆఫీసర్ అప్ డేట్ చేస్తారు అని రోనాల్డ్ రోస్ తెలిపారు. ఈ యాప్ లో నియోజకవర్గం పేరు, పోలింగ్ స్టేషన్ పేరు నమోదు చేస్తే వివరాలు క్యూ పరిస్థితి తెలుసుకోవచ్చని జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రోస్ తెలిపారు. ఓటు హక్కు ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలనే ఉద్దేశ్యంతో ఈ యాప్ ను రూపొందించారు.. ఓటరు జాబితాలో పేరు ఉన్న ప్రతి ఒక్కరు పోలింగ్ రోజున ఓటు వేయాలని రోనాల్డ్ రోస్ కోరారు.

## ఢిల్లీ చీఫ్ సెక్రటరీ పదవీకాలం మరో ఆరు నెలలు పొడింపునకు సుప్రీం ఆమోదం

**న్యూఢిల్లీ,నవంబర్29 :** ఢిల్లీ చీఫ్ సెక్రటరీ నరేష్ కుమార్ పదవీకాలాన్ని మరో 6 నెలలు పొడిగించేందుకు సుప్రీంకోర్టు బుధవారంనాడు అనుమతించింది. షెడ్యూల్ ప్రకారం ఈనెల 30వ తేదీతో నరేష్ కుమార్ పదవీకాలం ముగియాల్సి ఉంది. అయితే నిర్దేశిత రిటైర్మెంట్ గడువును మరో ఆరు నెలలు పొడిగించాలని అనుకుంటున్నట్టు సుప్రీంకోర్టుకు కేంద్రం తెలిపింది. ఇందుకు అత్యున్నత న్యాయస్థానం సమ్మతి తెలిపింది. కేంద్ర నిర్ణయం రాజ్యాంగం నిర్దేశించిన అధికారాల పంపిణీని ఉల్లంఘించడం లేదని కోర్టు అభిప్రాయపడింది. ఢిల్లీ ప్రభుత్వ పరిధిలోకి రాని పోలీస్, ల్యాండ్, పబ్లిక్ ఆర్డర్ అంశాలను డీల్ చేసే చీఫ్ సెక్రటరీ పదవీ కాలం పొడిగించే అధికారం కేంద్రానికి ఉందని పేర్కొంది. ప్రిమా ఫేసియా వ్యూ ఆధారంగా ఆరు నెలల పొడిగింపు నిర్ణయాన్ని తాము తీసుకున్నట్టు తెలిపింది.

# మంత్రి కేటీఆర్‌పై ఈసీకి కాంగ్రెస్ ఫిర్యాదు

- దీక్షాదివస్‌కు పిలుపునిచ్చి ఎలక్షన్‌కోడ్ ఉల్లఘించారని ఫిర్యాదు

**హైదరాబాద్,నవంబర్29(ఆర్ఎన్ఎ):** రాష్ట్రవ్యాప్తంగా దీక్షా దివస్ కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చి మంత్రి కేటీఆర్.. ఎన్నికల నియమావళి ఉల్లంఘించారని కాంగ్రెస్ పార్టీ ఈసీకి ఫిర్యాదు చేసింది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమన్వయ కమిటీ చైర్మన్ జి. నిరంజన్ తెలంగాణ సిఈఓకి ఫిర్యాదు చేశారు. దీక్షా దివస్‌కు పిలుపునిచ్చి మంత్రి కేటీఆర్ ఎలక్షన్‌కోడ్ నియమాలను ఉల్లఘించారని.. కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమన్వయ కమిటీ చైర్మన్.. జి నిరంజన్ తెలంగాణ సీఈఓకి ఫిర్యాదు చేశారు. నవంబర్ 29న రాష్ట్రవ్యాప్తంగా దీక్ష దివస్ కార్యక్రమాలు నిర్వహించాలని మంత్రి కేటీఆర్? బీఆర్ఎస్ కార్యకర్తలకు పిలుపునివ్వడం.. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించడమేనని తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా నిన్నటితో ఎన్నికల ప్రచారం ముగిసిందని.. 144 సెక్షన్ అమలులో ఉన్నా, మీడియాపై ఆంక్షలు ఉన్నా దీక్షా దివస్ కార్యక్రమాలు చెయ్యడం ఓటర్లను ప్రభావితం చెయ్యడమే అవుతుందని కాంగ్రెస్ నేతలు పేర్కొన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తున్న మంత్రి కేటీ ఆర్‌పై.. తక్షణమే చర్యలు తీసుకోవాలని ఈసీని కోరారు. నేడు జరగబోయే పోలింగ్ కోసం ఆంధ్రప్రదేశ్ నుంచి వస్తున్న ఓటర్లను.. ఆంధ్రా సరిహద్దుల వద్ద ఏపీ పోలీసులు ఆపుతున్నారని కాంగ్రెస్ నేతలు ఈసీకి తెలిపారు. ఇక్కడున్న బీఆర్ఎస్‌కు మద్దతుగా.. ఏపీ పోలీసులు పనిచేస్తున్నారని అందుకే ఓటర్లను ఆపుతున్నారని భావిస్తున్నామన్నారు. సరిహద్దుల్లో పోలీసులు ఓటర్లను ఆపవద్దని సీఈవోను కోరినట్లు



తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా 144 సెక్షన్ అమలులో ఉంది. ఎన్నికల నియమావళిని ఉల్లంఘించిన బీఆర్?ఎస్? మంత్రులు, నేతలపై చర్యలు తీసుకోవాలని ఈసీని కోరామన్నారు. బీఆర్ఎస్ నాయకులు విచ్చలవిడిగా డబ్బులు పంచి ఓట్లు వేయించుకునేలా పోలీసు యంత్రాంగాన్ని దుర్వినియోగం చేస్తున్నారని వికాస్‌రాజ్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఈసీ ఉందా.. పోలీసు వ్యవస్థ పనిచేస్తుందా అన్న సంశయం ప్రజల్లో ఏర్పడిందని కాంగ్రెస్ ఎన్నికల కమిటీ ఛైర్మెన్ జి. నిరంజన్ పేర్కొన్నారు. పోలీసులకు చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదని.. పోలీసు వ్యవస్థ పనిచేస్తుందా అని కాంగ్రెస్ నేతలు ప్రశ్నించారు. ఎన్నికలు పారదర్శకంగా జరిగేలా పోలీసులు చూస్తారా అన్న అనుమానం నెలకొందని అసహనం వ్యక్తం చేశారు. అంబర్ పేటలో విచ్చలవిడిగా డబ్బులు పంచుతున్నా ఎవరూ ఏమీ చేయలేకపోతున్నారని.. ఇలాగే కొనసాగి రేపు ఏమైనా జరిగితే అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.


# కోవిడ్ కారణంగా పెరిగిన అకాల జననాలు

### కోవిడ్ కారణంగా పెరిగిన అకాల జననాలు

### ప్రమాదాన్ని తగ్గించిన కోవిడ్ వ్యాక్సిన్లు..

### జనన రికార్డులు విశ్లేశించిన అమెరికా పరిశోధకులు

**న్యూఢిల్లీ,నవంబర్29 :** కోవిడ్-19 మహమ్మారి ప్రపంచదేశాలను కలవరపెట్టింది. చైనాలో ప్రారంభమైన ఈ కరోనా వైరస్ అనతికాలంలోనే ప్రపంచంలోని అన్ని దేశాలకు వ్యాప్తి చెందింది. లక్షల్లో ప్రజలు మరణించారు. రూపాలను మార్చుకుంటూ కొత్త వేరియంట్ల రూపంలో ప్రజలపై దాడి చేసింది. చైనాతో పాటు అమెరికా, ఇటలీ, భారత్ వంటి దేశాల్లో ఎక్కువగా మరణాలు నమోదయ్యాయి. దీన్ని అంతం చేయడానికి ప్రపంచంలోని పలు దేశాలు వ్యాక్సిన్లను తయారుచేసుకున్నాయి. ఇప్పుడిప్పుడే ఈ మహమ్మారి నుంచి ప్రపంచదేశాలు కోలుకుంటున్నాయి. ఇదిలా ఉంటే కోవిడ్ పాండిమిక్ వల్ల అకాల జననాలకు దారి తీసిందని, ఇలా ముందస్తు జననాలను (ప్రీమెచర్ బర్త్స్)ని తగ్గించడానికి కోవిడ్ వ్యాక్సిన్లు కారణమయ్యాని తాజాగా ఓ అధ్యయనంలో వెల్లడైంది. అమెరికా పరిశోధకులు కాలిఫోర్నియాలోని జనన రికార్డులు విశ్లేషించారు. మాటెర్నల్ కోవిడ్-19 ఇన్ఫెక్షన్లు ముందస్తు డెలవరీల సంభావ్యతను 1.2 పాయింట్లు పెరిగి 7.1 నుంచి 8.3 శాతానికి పెంచిందని పరిశోధకులు తెలిపారు. 37 ఏళ్ల గర్భధారణ సమయానికి ముందుగానే జనానాలు జరిగాయని వెల్లడించింది.2020 జూలై నుంచి నవంబర్ వరకు వైరస్ వ్యాప్తి చెందడంతో కోవిడ్-19 ఉన్న తల్లికి గడువు తేదీ కంటే మూడు వారాల కంటే ముందు బిడ్డకు జన్మనిచ్చే అవకాశం ఊహించిన దానికన్నా 5.4 శాతం పాయింట్లు ఎక్కువగా 6.9 శాతం నుంచి 12.3 శాతానికి పెరిగిందని స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం మరియు విస్కాన్సిన్-మాడిసన్ విశ్వవిద్యాలయం అధ్యయనంలో తేలింది. 2022లో ముందస్తు జననాలు చాలా వరకు పడిపోయాయి. అంతకుముందు 2021లోనే ముందస్తు జననాల ప్రమాదం కొద్దిగా తగ్గిందని పరిశోధకులు చెప్పారు. దీని కోసం 40 మిలియన్ల జనన రికార్డులను పరిశీలించారు. వ్యాక్సిన్లను తీసుకోవడం వల్ల ఇలా బిడ్డల ముందస్తు జననాల ప్రమాదం తగ్గిందని పరిశోధనలో తేలింది. ప్రొసీడింగ్స్ ఆఫ్ ది నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ జర్నల్‌లో పరిశోధనకు సంబంధించిన వివరాలను ప్రచురించారు. కోవిడ్ వ్యాక్సిన్లు రక్షణను పెంచినట్లు ఈ పరిశోధన హైలెట్ చేసింది. రోగనిరోధక శక్తిని వేగంగా పెంచడం ద్వారా, ముందస్తు టీకాలు తీసుకోవడం వల్ల అమెరికాలో వేలాదిగా ముందస్తు



జననాలను నిరోధించినట్లు తేలింది. గర్భిణిలు కోవిడ్-19 వ్యాక్సిన్లు తీసుకోవడం వల్ల అకాల జననాలు నివారించడంతో పాటు మరిన్ని ఆరోగ్య ఆందోళనలను తగ్గించడానికి సహాయపడిందని పరిశోధకులు తెలిపారు. గర్భంలో ఎదుగుతున్న పిండంపై టీకా ప్రతికూల ప్రభావాలు చాలా తక్కువగా ఉన్నట్లు తేలింది. వ్యాక్సినేషన్ పిండానికి హాని కలిగిస్తుందనేది వాస్తవం కాదని తెలిపారు.

## ట్రైన్‌లో కలుషిత ఆహారం..

### 40 మంది ప్రయాణికులకు అస్వస్థత

**చెన్నై,నవంబర్29 :** చెన్నై నుంచి పూణే వెళ్తున్న భారత్ గౌరవ్ ట్రైన్‌లో కలుషిత ఆహారం అందించినట్లు తెలుస్తోంది. ట్రైన్‌లో కలుషిత ఆహారం తిన్న 40 మంది ప్రయాణికులు ఫుడ్ పాయిజన్ అయింది. రైల్వే మంత్రిత్వశాఖలోని కొన్ని వర్గాల సమచారం మేరకు ఓ ప్రైవేట్ సంస్థ ట్రైన్‌లో ఫుడ్ సర్వీస్ నిర్వహిస్తుంది. సదరు కంపెనీలపై చర్యలు తీసుకునేందుకు రైల్వే మంత్రిత్వ శాఖ సిద్ధమైనట్లు తెలుస్తోంది. అయితే ఫుడ్ పాయిజన్‌కి గల కారణాలు ఇంకా నిర్ధారించలేదు. తదుపరి విచారణ కోసం ఫుడ్ శాంపిల్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గతంలో కూడా కొన్ని రైళ్లలో ఇదే తరహాలో కలుషిత ఆహారాన్ని ప్రయాణికులకు అందించడం వివాదస్పదమైంది.

## పాత బస్తీలో భారీ అగ్ని ప్రమాదం

**హైదరాబాద్,నవంబర్29:** హైదరాబాద్‌లోని పాత బస్తీలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఓ చెప్పుల షోరూంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అయితే ఆ సమయంలో షాపులో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. అయితే భారీగా ఆస్తి నష్టం జరిగినట్టు తెలుస్తోంది. వివరాలు.. చెత్తా బజార్‌లోని ఓ చెప్పుల షోరూంలో బుధవారం మధ్యాహ్నం ఒక్కసారిగ మంటల ఎగసిపడ్డాయి. ఈ ఘటనపై స్థానికులు పోలీసులకు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది రెండు ఫైర్ ఇంజన్లతో హుటాహుటిన అక్కడికి చేరుకుని మంటలను అదుపు చేశాయి. ఘటన సమయంలో షాపులో ఎవరు లేకపోవడం ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. అయితే ప్రమాదంలో భారీగా ఆస్తి నష్టం జరిగినట్టు సమాచారం. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్టు పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది.

## అత్యంత విషమంగా విజయకాంత్ ఆరోగ్య పరిస్థితి

**చెన్నై,నవంబర్29 :** ఒకప్పటి తమిళ స్టార్ హీరో, డీఎండీకే పార్టీ అధినేత విజయకాంత్ ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని అసలు ఏమాత్రం నిలకడగా లేదని చెన్నైలోని మయత్ ఆస్పత్రి యాజమాన్యం నివేదిక ఇచ్చింది. డీఎండీకే అధినేత విజయకాంత్ అనారోగ్య కారణాలతో గత నవంబర్ 18న చెన్నైలోని మయత్ ఆస్పత్రిలో చేరారు. విజయకాంత్ దగ్గు, జలుబు, గొంతునొప్పితో బాధపడుతున్నందున సాధారణ వైద్య పరీక్షల కోసం వెళ్లినట్లు డీఎండీకే అప్పట్లో వెల్లడించింది. ఈ విషయమై అప్పట్లో డీఎండీ విడుదల చేసిన పత్రికా ప్రకటనలో "డీఎంయూడీఐ అధ్యక్షుడు విజయకాంత్ సాధారణ వైద్య పరీక్షల కోసం వెళ్లారు, ఒకట్రెండు రోజుల్లో ఇంటికి తిరిగి వస్తారు, వదంతులను ఎవరూ నమ్మవద్దని పేర్కొంది. అయితే ఆయన హాస్పిటల్ లో చేరిన వెంటనే విజయకాంత్‌కు కృత్రిమ శ్వాస అందిస్తున్నట్లు మీడియాలో వార్తలు ప్రచురితమవ్వగా.. నవంబర్ 20న డీఎండీకే పార్టీ అధిష్టానం ఆ వార్తలను ఖండిస్తూ ప్రకటన విడుదల చేసింది. అయితే సుమారు తొమ్మిది రోజులు అనంతరం ఈ రోజు అధినేత విజయకాంత్ ఆరోగ్య పరిస్థితికి సంబంధించి మయత్ హాస్పిటల్ పరిపాలన ఒక కొత్త వైద్య నివేదికను విడుదల చేసింది. అందులో విజయకాంత్ ఆరోగ్యం మెరుగుపడిందని, అయినప్పటికీ, గత 24 గంటల్లో ఆయన ఆరోగ్య పరిస్థితి స్థిరంగా లేనందున, పల్మనరీ చికిత్సలో సహాయం కావాలని పేర్కొంది. ఆయన త్వరగా కోలుకుంటాడని ఆశిస్తున్నామని వెల్లడించింది. ఇక ఆసుపత్రిలో వైద్యుల అభిప్రాయం ప్రకారం, ఆయనకి ఇంకా 14 రోజులు ఆసుపత్రిలో నిరంతర చికిత్స అవసరం అని తెలుస్తోంది. ఇక అనారోగ్య పరిస్థితుల కారణంగా విజయకాంత్ క్రియాశీలక రాజకీయాల్లో యాక్టివ్ గా లేకున్నా ఆయన భార్య ప్రేమలత విజయ ప్రభాకరన్ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. విజయకాంత్ చివరిసారిగా తన పుట్టినరోజు సందర్భంగా డిఎండి ప్రధాన కార్యాలయంలో వాలంటీర్లను కలిశారు. ఆయనను వీల్ చైర్ మీద కూర్చోబెట్టి తీసుకొచ్చి వాలంటీర్లకు చేతులు వంచి కెప్టెన్, కెప్టెన్ అంటూ ఉత్సాహంగా నినాదాలు చేశారు. రీసెంట్ గా దీపావళిని తన కుటుంబంతో కలిసి ఇంట్లో జరుపుకుని సోషల్ మీడియాలో ఆ ఫోటోలు షేర్ చేశాడు విజయకాంత్. ఇక కొన్నాళ్ల క్రితం విలేకరులతో సమావేశమైన మంత్రి ఎం. సుబ్రమణ్యం.. విజయకాంత్‌ను ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నట్లు సమాచారం. విజయకాంత్‌కు ఇప్పటికే కిడ్నీ మార్పిడి జరిగిందని, సంబంధిత వైద్యులు ఆయనకు చికిత్స అందిస్తున్నారని కూడా ఆయన తెలియజేశారు.

## జపాన్‌లోని బీచ్‌లో కూలిన అమెరికా యుద్ధ విమానం



**యకుషిమా,నవంబర్29 :** అమెరికాకు చెందిన ఓ ఫైటర్ జెట్ కుప్పకూలింది. మీడియా నివేదికల ప్రకారం.. ఈ విమానం జపాన్ తీరానికి సమీపంలో కూలిపోయింది. ఎనిమిది మంది వ్యక్తులతో వెళ్తున్న సైనిక విమానం బుధవారం కుప్పకూలినట్లు కోస్ట్ గార్డ్ తెలిపింది. యకుషిమా ద్వీపంలో యుఎస్ మిలిటరీ ఓస్ప్రే కూలిపోయిందని మధ్యాహ్నం 2:47 గంటలకు మాకు సమాచారం అందినట్లు సైనిక ప్రతినిధి చెప్పారు. బోర్డులో ఎనిమిది మంది సిబ్బంది ఉన్నారని కూడా తమకు సమాచారం అందిందన్నారు. ప్రస్తుతానికి వారి ఆచూకీపై తదుపరి సమాచారం లేదని ఆయన చెప్పారు. ఈ ఏడాది ఆగస్టు నెలలో కాలిఫోర్నియాలోని సైనిక స్థావరం సమీపంలో అమెరికాకు చెందిన యుద్ధ విమానం కూలిపోయింది. ఈ ప్రమాదంలో ఓ పైలట్ చనిపోయాడు. ఈ విషయాన్ని మెరైన్ కార్ప్స్ ధృవీకరించింది. శాన్ డియాగో కేంద్రానికి 24 కిలోమీటర్ల దూరంలో ఉన్న మెరైన్ కార్ప్స్ ఎయిర్ స్టేషన్ మిరామార్ సమీపంలో అర్ధరాత్రి ముందు హార్నెట్ జెట్ కూలిపోయిందని పేర్కొంది. సెర్చ్ సిబ్బంది పైలట్ మృతదేహాన్ని కనుగొన్నారు.

## దొంగేదొంగ అన్నతీరుగా వైసిపి వ్యవహారం

### ఇసిని కలిసి ఫిర్యాదు చేసినట్లు అచ్చన్న వెల్లడి



**అమరావతి,నవంబర్29 :** వైసీపీ ప్రభుత్వ వైఖరి దొంగే దొంగ అన్న చందంగా ఉందని ఏపీ టీడీపీ చీఫ్ అచ్చెన్నాయుడు వ్యాఖ్యలు చేశారు. బుధవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని టీడీపీ ప్రతినిధి బృందం కలిసింది. అనంతరం అచ్చెన్న మీడియాతో మాట్లాడుతూ... వ్యవస్థ మీ చేతుల్లో పెట్టుకొని ఓడిపోతామని దుర్వినియోగం చేస్తున్నారన్నారు. ఏపీలో 8 జిల్లాల కలెక్టర్‌లు వైసీపీ కార్యకర్తలుగా వ్యవహరిస్తున్నారని.. వారిపై ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఫార్మ్ 6, 7, 8 డుప్లికేట్‌లపై తాము పట్టిన అప్లికేషన్లు ఏమయ్యాయని ప్రశ్నించారు. పరిటాల సునీత 20 వేల ఓట్లు బోగస్ ఉన్నాయని చెపితే ఫామ్ 7 పెట్టమని కలెక్టర్ చెప్పారన్నారు. అదే జిల్లా ఉరవకొండలో మాత్రం 10 వేల ఓట్లు తీసేశారన్నారు. రెండు చోట్ల కలెక్టర్ ఒక్కరే అని చెప్పారు. 17 నియోజకవర్గాల్లో ఆధారాలతో సహా వైసీపీ ఓట్లు అక్రమాలపై ఫిర్యాదు చేశామన్నారు. 8 జిల్లాల కలెక్టర్‌లు చేస్తున్న తప్పులు అన్ని రికార్డ్ అవుతున్నాయ మీరు జాగ్రత్తగా ఉండాలన్నారు. శ్రీకాకుళం, కోనసీమ, గుంటూరు, అన్నమయ్య, బాపట్ల, తిరుపతి తదితర జిల్లాల కలెక్టర్‌లపై ఫిర్యాదు చేశామని అచ్చెన్నాయుడు వెల్లడించారు.

## చిరుత దాడిలో మరణించిన లక్షితకు పరిహారం

### ఆదేశించినా చెల్లించకపోవడంపై హైకోర్టు ఆగ్రహం

**అమరావతి,నవంబర్29 :** తిరుమల కాలిబాటలో చిరుత దాడిలో మరణించిన లక్షిత కుంటుంబానికి 5 లక్షలు పరిహారం ఇవ్వకపోవడంపై ఏపీ హైకోర్ట్ అభ్యంతరం తెలిపింది. కోర్టు ఆదేశించినా చెల్లించక పోవడం ఏమిటని టీటీడీపై కోర్ట్ ఆగ్రహం వ్యక్తం చేసింది. దేశంలో ధనిక ఆలయం ఆయినా డబ్బు చెల్లించక పోవడం ఏమిటని ప్రశ్నించింది. నడకదారిలో ఫెన్సింగ్ వేసేందుకు వైల్డ్ లైఫ్ కార్పొరేషన్ అఫిడవిట్‌లో సుముఖత వ్యక్తం చేసింది. అవసరమైన ప్రాంతాల్లో అండర్ పాసులు ఏర్పాటు చేసేందుకు కూడా అభ్యంతరం లేదని వైల్డ్ లైఫ్ తెలిపింది. వైల్డ్ లైఫ్, టీటీడీ, రాష్ట్ర అటవీ శాఖలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని పిటీషనర్ తరపు న్యాయవాది యాలమంజుల బాలాజీ కోరింది. హైకోర్ట్ పర్యవేక్షణ అవసరమని బాలాజీ చెప్పింది. రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని టీటీడీ, తదితరులకు హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

# తెలంగాణలో ఎన్నికలపై ఏపీలో జోరుగా బెట్టింగులు




**హైదరాబాద్,నవంబర్29 :** తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు ఫలితాలు దేశవ్యాప్తంగా ఉత్కంఠ రేపుతున్నాయి.. మంగళవారం సాయంత్రం 5 గంటలకే ప్రచారానికి తెరపడింది..ఇప్పుడు ప్రలోభాల పర్వం జోరుగా సాగుతున్నట్టు కొన్ని ఘటనలు చూస్తే అర్థమవుతోంది.. గురువారం రోజు పోలింగ్ జరగనుండగా.. డిసెంబర్ 3వ తేదీన ఫలితాలు వెలువడనున్నాయి. అయితే, ఎన్నికల ఫలితాలపై తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్‌లో జోరుగా బెట్టింగ్‌లు కొనసాగుతున్నాయట.. ఏపీలోని ఉభయ గోదావరి జిల్లాలు, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో కోట్ల రూపాయలు పందెం కాస్తున్నారట బెట్టింగ్ రాయుళ్లు.. మరోసారి బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందా తెలంగాణలో కాంగ్రెస్ బోణీ కొడుతుందా బీజేపీకి వచ్చే స్థానాలు ఎన్ని ఇలా పందెం కాస్తున్నారట. ఏసీజన్ అయినా క్యాష్ చేసుకునే బెట్టింగ్ రాయుళ్లు.. ఇప్పుడు తెలంగాణ ఎన్నికలపై పడ్డారు.. బీఆర్ఎస్ హ్యాట్రిక్ కొడుతుందా కాంగ్రెస్ తెలంగాణ వచ్చిన తర్వాత బోణీ కొడుతుందా అంటూ భారీగా పందెం కాస్తున్నారట.. మరోవైపు, కామారెడ్డిలో గెలిచేది కేసీఆరా లేదా రేవంత్ రెడ్డియా గజ్వేల్‌లో విజయం కేసీఆర్‌ని వరిస్తుందా ఈటల వైపు జనం మొగ్గు చూపుతారా కొడంగల్‌లో రేవంత్ పరిస్థితి ఏంటి నల్గొండలో కోమటి రెడ్డి బ్రదర్స్ విజయం సాధిస్తారా కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు మెజార్టీ ఎంత ఉండొచ్చు ఇలా అనేక రకాలుగా బెట్టింగ్‌లు వేస్తున్నారట.. ఏ పార్టీ అధికారంలోకి వస్తుందనే విషయంతో పాటు.. టాప్ లీడర్ల గెలుపు, ఓటమిలపై కూడా అభ్యర్థుల వారీగా ఒకటికి మూడు రెట్లు ఇస్తాం.. ఒకటికి రెట్టింపు ఇస్తామంటూ పందెం కాస్తున్నారట బెట్టింగ్ రాయుళ్లు.

# సొరంగం నుంచి బయటపడ్డ కార్మికుల్లో ఉద్వేగం

- **రెస్క్యూ టీమ్‌ను అభినందించిన ప్రధాని మోడీ**
- **సొరంగంలో చిక్కుకున్న వారి ధైర్యం స్ఫూర్తిమంతం**



**న్యూఢిల్లీ,నవంబర్29 :** ఉత్తరాఖండ్‌లోని సిల్క్యారా సొరంగంలో చిక్కుకున్న 41 మంది కార్మికులు ఎట్టకేలకు బయటకు వచ్చారు. 17 రోజుల పాటు పలు రకాలు రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించిన అధికారులు మంగళవారం రాత్రి రాట్ డ్రిల్లింగ్ పద్దతితో కార్మికులను రక్షించి ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ప్రధాని నరేంద్ర మోదీ మంగళవారం అర్ధరాత్రి కార్మికులకు ఫోన్ చేసి మాట్లాడారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్మికులను బయటకు తీసిన వెంటనే, ప్రధాన మంత్రి సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. కార్మికులను సురక్షితంగా, విజయవంతంగా బయటకు తీసుకు రావడానికి కృషి చేసిన రెస్క్యూ బృందాలను, వారు చేసిన ప్రయత్నాలను ప్రధాని ప్రశంసించారు. మిషన్‌లో పాల్గొన్న ప్రతి ఒక్కరూ మానవత్వం, ఐక్యత, జట్టు కృషికి అద్భుతమైన ఉదాహరణగా నిలిచారని కొనియాడారు. 'ఉత్తరకాశీలో కార్మిక సోదరుల రెస్క్యూ ఆపరేషన్ విజయవంతం కావడం ప్రతి ఒక్కరినీ భావోద్వేగానికి గురిచేస్తోంది. సొరంగంలో చిక్కుకున్న స్నేహితులకు నేను ఒకటి చెప్పాలనుకుంటు న్నాను. మీ ధైర్యం, సహనం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిని కలిగిస్తుంది. మీ అందరికి మంచి జరగాలని, ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటున్నాను. సుదీర్ఘ నిరీక్షణ తర్వాత, మన స్నేహితులు వారి ప్రియమైన వారిని కలుసుకోవడం ఆనందం కలిగించే విషయం. ఈ కష్ట సమయంలో కార్మికుల కుటుంబాలు చూపించిన సహనం, ధైర్యాన్ని ప్రశంసించకుండా ఉండలేమ. ఈ రెస్క్యూ ఆపరేషన్‌తో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరి స్ఫూర్తికి నేను వందనం చేస్తున్నాను. వారి ధైర్యం, సంకల్పం కార్మిక సోదరులకు కొత్త జీవితాన్ని ప్రసాదించాయి. ఈ మిషన్‌లో పాల్గొన్న ప్రతి ఒక్కరూ మానవత్వం చూపారు. జట్టు కృషికి అద్భుతమైన ఉదాహరణగా నిలిచారని అన్నారు. దాదాపు 17 రోజుల శ్రమ, కృషి ఫలించింది. ఉత్తరకాశీలోని సిల్క్యారా సొరంగం లో చిక్కుకున్న 41 మంది కార్మికులను అధికారులు మంగళవారం సురక్షితంగా కాపాడారు. 17 రోజుల పాటు సాగిన రెస్క్యూ ఆపరేషన్ లో కార్మికులను రక్షించేందుకు చేసిన పలు ప్రయత్నాలు విఫలం అయ్యాయి. అయినా అలుపెరుగని ప్రయత్నం చేసిన ప్రభుత్వం మంగళవారం వారిని బయటకు తీసుకొచ్చింది. రాట్ హోల్ మైనింగ్ నిపుణులు రాత్రి 7 గంటలకు శిథిలాలను పూర్తిగా తొలగించడంతో కార్మికులు సురక్షితంగా బయటకు వచ్చారు. సహాయక బృందం స్టీల్ పైప్ ద్వారా ఒక్కొక్కరిని స్ట్రెచర్లపై బయటకు తీసుకువచ్చారు. ర్యాట్-హోల్-మైనింగ్ టెక్నిక్‌లో నిపుణుల బృందం సాయంతో రాత్రి 8 గంటల సమయములో తొలి కార్మికుడు సొరంగం నుంచి బయటపడ్డాడు. వెంటనే అతన్ని ఒక అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. రెస్క్యూ ఆపరేషన్ ద్వారా సొరంగం నుంచి బయటపడిన కార్మికుల్లో కొందరి మొహాల్లో చిరునవ్వు కనిపించింది. మరికొందరు మొహాల్లో కృతజ్ఞత, ఇంకొందరిలో అలసిపోయిన భావాలు కనిపించాయి. సొరంగం నుంచి ఒక్కొక్కరుగా బయటకు వస్తున్నప్పుడు వారిని ఉత్సాహ పరిచేలా అక్కడ ఉన్నవారు నినాదాలు చేశారు. బయటకు వచ్చిన వారిని చూసి బంధువులు భావోద్వేగానికి గురయ్యారు. కార్మికులను ఆస్పత్రులకు తరలిస్తున్నప్పుడు ప్రజలు రోడ్డుకు ఇరువైపులా నిలబడి స్వాగతం పలికారు. తమ వారు సురక్షితంగా బయటపడడంతో కార్మికుల కుటుంబాలు స్వీట్లు పంచుకుని సంబరాలు చేసుకున్నారు. రెస్క్యూ వార్త వెలువడడంతో చాలా మంది టీవీ, ఫోన్‌లకు అతుక్కుపోయారని చెప్పారు.

## వైసిపితో అమీతుమీకే టిడిపి సిద్ధం

- **లోకేశ్ పాదయాత్రతో మళ్లీ దూకుడు**
- **నేడు తిరుమలకు రానున్న బాబు**
- **బాబును రాజకీయంగా దెబ్బతీసే ప్రయత్నాల్లో జగన్**

**అమరావతి,నవంబర్29 :** ఎపిలో అధికార వైసిపితో అమీతుమీ అన్నంతగా విపక్ష టిడిపి రాజకీయాలు నెరపుతోంది. ఇటీవలి అనేక అంశాల్లో టిడిపి అనుసరిస్తున్న తీరుతో రాజకీయాలు తారాస్థాయికి చేరాయి. చంద్రబాబు కేసుల్లో బెయిల్ పొందారు. నేడు తిరుమల శ్రీవారిని దర్శించుకున్నాక తన రాజకీయ పర్యటనలపై విధాన ప్రకటన చేసే అవకాశం ఉందని అంటున్నారు. ఇప్పటికే లోకేశ్ మళ్లీ తన యువగళం పాదయాత్రను చేపట్టారు. తాజా రాజకీయాల నేపథ్యంలో ఇక వైసిపితో అమీతుమీ అన్నట్లుగా టిడిపి ఉంది. జగన్ అవినీతిపై యుద్ధం చేస్తామని లోకేశ్ ప్రకటించారు. మరోవైపు రాజధాని రగడ కొంత తగ్గినా..విశాఖ వైపు సిఎం జగన్ అడుగులు వేస్తున్నారు. బాబు విశాఖకు వ్యతిరేకం అన్న ముద్ర వేస్తున్న వైసిపి విశాఖను రాజధాని చేయాలన్న పట్టుదలతో అమరావతిని పక్కన పెట్టారు. దీనిపై కోర్టులో కేసు తేలాల్సి ఉంది. అమరావతి ఉద్యమం కూడా తారాస్థాయికి చేరింది. విశాఖ ఉద్యమం కూడా నివురుగప్పిన నిప్పులా ఉంది. ఈ క్రమంలో విశాఖ రాజధానికి బాబు వ్యతిరేకం అంటూ ప్రచారం కూడా చేశారు. మొత్తంగా ఇప్పుడు వైసిపిని టిడిపి టార్గెట్ చూస్తూ పోతున్నది. మరో నాలుగైదు నెలల్లో ఎన్నికలు రాబోతున్నాయి. ఈ క్రమంలో బిజెపి,జనసేనలు కూడా తమవంతుగా పోరాడుతున్నారు. అలాగే ముఖ్యమంత్రి జగన్ మేనిఫెస్టో, నవరత్నాలూ అంటూ ఒక్కోటి అమలు చేసుకుంటూ ముందుకు పోతున్నారు. డబ్బుల పందేరంతో ఆర్థిక స్థితి పూర్తిగా దిగజారి పోయింది. పాలనలో బిజీగా ఉంటూనే టిడిపిని అడ్డుకునేలా వైసీపీ నేతలకు జగన్ దిశానిర్దేశం చేస్తున్నట్లుగా ఉంది. మొత్తం అన్ని జిల్లాల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి కనిపిస్తోంది. మరోవైపు అంతర్గత కలహాలు వీడి పార్టీకోసం పనిచేయాలని గట్టిగానే శ్రేణులకు ఆదేశాలు ఇస్తున్నారు. ప్రతి జిల్లాలో ముఖ్యనేతలు, ప్రజాప్రతినిధుల మధ్య విభేధాలు తారాస్థాయికి చేరుకుంటున్నాయి. నేతల విభేదాలతో కార్యకర్తలు సైతం వర్గాలుగా విడిపోతున్నారు. ఒకవైపు ముఖ్యమంత్రి జగనేమో నేతలందరూ కలిసికట్టుగా పనిచేయాలని ఆదేశాలిస్తున్నారు.


## తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు

- **హెచ్చరించిన వాతావరణశాఖ**



హైదరాబాద్/అమరావతి,నవంబర్29 : తెలుగు రాష్ట్రాలకు వాతావరణశ్ఖాఖ హెచ్చరిక చేసింది. తెలంగాణలో రెండు రోజులపాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. మధ్య భారతదేశంతోపాటు ఉత్తర తెలంగాణ ప్రాంతాలపై ఆకాశం మేఘావృతమై ఉన్నదని తెలిపింది. అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ జరుగనున్న గురువారం (నవంబర్ 30న) రోజున దక్షిణ, మధ్య తెలంగాణ జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని పేర్కొంది. ఈ మేరకు హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాలకు ఐఎండీ అలర్ట్ జారీ చేసింది. కాగా, రాష్ట్రంలో ఇప్పటికే పలు జిల్లాల్లో వర్షాలు కురుస్తున్నాయి. మంగళవారం నిజామాబాద్, నిర్మల్, కామారెడ్డి, మెదక్ జిల్లాల్లో పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడ్డాయి. నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం జానకంపేటలో అత్యధికంగా 5.1 సెం.మీ.లు, నిజామాబాద్ నార్త్‌లో 4.35 సెం.మీ.లు, నిజామాబాద్‌లో 3.93 సెం.మీ.లు, నిజాంపేటలో 3.58 సెం.మీ.లు, కల్దుర్తి, గోపన్‌పల్లిలలో 3.45 సెం.మీ.లు, చిన్న మావంధిలో 3.15 సెం.మీ.ల వర్షపాతం నమోదైంది. ఇదిలావుంటే మరో రెండ్రోజుల్లో ఏపీలో పలు చోట్ల వర్షాలు పడే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. దక్షిణ అండమాన్ ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం బలపడింది. పశ్చిమ - వాయువ్య దిశగా కదులుతూ రేపటికి వాయుగుండంగా మారే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. శనివారం నాటికి నైరుతి ఆనుకుని ఉన్న ఆగ్నేయ బంగాళాఖాతంలో తుఫానుగా మారే అవకాశం ఉంది.దీని ప్రభావంతో రాష్ట్రంలో శనివారం నుంచి వర్షాలు పడనున్నాయి. రాయలసీమ, కోస్తాంధ్రలో అక్కడక్కడ భారీ వర్షాలు, చాలాచోట్ల తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు పడే అవకాశం ఉంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ఇప్పటి నుంచే రైతులు వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. ఆదివారం వరకు మత్స్యకారులు వేటకు వెళ్ళరాదని విపత్తుల నిర్వహణ సంస్థ స్పష్టం చేసింది.

# నేటి పోలింగ్‌పై నేతల నజర్



- **నేటి పోలింగ్‌పై నేతల నజర్**
- **బూత్‌స్థాయి కార్యకర్తలతో నేతల సమీక్ష**
- **ఎక్కువ మందిని ఓటుకు తీసుకుని వచ్చేలా ప్లాన్**
- **గతానికి భిన్నంగా అన్ని పార్టీల నేతల ప్రచారం**

**హైదరాబాద్,నవంబర్29 :** రాష్ట్రంలో ఎన్నికల ప్రచారానికి తెరపడడంతో ఇక పోల్ మేనేజ్‌మెంట్‌పై నేతలు దృష్టి సారించారు. గురువారం జరిగే పోలింగ్‌లో ఎక్కువమందిని పోలింగ్ కేంద్రాలకు తీసుకుని వచ్చేలా బూత్ స్థాయి నేతలు ప్రయత్నాలు మొదలు పెట్టారు. నేతలు నేరుగా ఆయా నియోజకవర్గాల్లో పరిస్థితులను సమీక్షిస్తున్నారు. పోలింగ్‌కు కొన్ని గంటలు మాత్రమే మిగిలి ఉండడంతో ఓటర్లను నేరుగా కలుసుకుని ఓట్లను అర్థించే పనిలో పడ్డారు. అసెంబ్లీ ఎన్నికలకు అక్టోబర్ 9న షెడ్యూల్ వెలువడగా.. ఈ నెల 3న నోటిఫికేషన్ విడుదలైంది. ప్రకటన కంటే ముందే రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం వేడెక్కింది. నామినేషన్ల ఘట్టం పూర్తయ్యాక ప్రచారం ఊపందుకుంది. మొత్తం119 నియోజకవర్గాలకుగాను.. ఏజెన్సీ ప్రాంతంలోని 13 నియోజకవర్గాల్లో మంగళవారం సాయంత్రం 4 గంటలతో, మిగతా 106 సెగ్మెంట్లలో 5 గంటలతో ఎన్నికల ప్రచారం ముగిసింది. అన్ని నియోజకవర్గాల్లో 30వ తేదీన గురువారం నాడు పోలింగ్ జరగ నుండడంతో రాష్ట్రమంతటా ఆంక్షలు అమలులోకి వచ్చాయి. ఎలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలు, రోడ్ షోలు నిర్వహించడానికి వీలు లేదు. ఎన్నికల ప్రచారానికి వచ్చిన స్థానికేతరులు ఆయా నియోజక వర్గాల నుంచి ఇప్పటికే తిరిగి వెళ్లిపోయారు. ప్రచారంలో ఆయా పార్టీల నేతలు పోటాపోటీగా సుడిగాలి పర్యటనలు చేశారు. అందరికంటే ముందుగా ఆగస్టు 21న బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించిన సీఎం కేసీఆర్.. అక్టోబర్15న హుస్నాబాద్ సభతో ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. 31 రోజుల్లో రాష్ట్ర వ్యాప్తంగా 95 సభల్లో పాల్గొన్నారు. గజ్వేల్ సభతో ప్రచారం ముగించారు.రేవంత్ రెడ్డి 63 నియోజకవర్గాల్లో 87 సభలకు హాజరయ్యారు. అక్టోబర్ 16న వికారాబాద్‌లో ప్రచారం మొదలుపెట్టి, మల్కాజ్‌గిరి రోడ్‌షోతో ముగించారు. కేటీఆర్60 రోజుల్లో 70 రోడ్ షోలలో పాల్గొన్నారు. 30 పబ్లిక్ మీటింగుల్లో ప్రసంగించారు. వివిధ వర్గాలతో సమావేశాలు పెట్టి మాట్లాడారు. 150కి పైగా టెలీ కాన్ఫరెన్స్‌లు నిర్వహించారు. హరీశ్ రావు 60 రోజుల్లో 90కి పైగా నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రచార సభల్లో, రోడ్ షోలలో పాల్గొన్నారు. ఎమ్మెల్సీ కవిత 70కి పైగా ప్రచార సభలు, రోడ్‌షోల్లో ప్రచారం చేశారు. ఇకపోతే కాంగరెస్ అగ్రనేత రాహుల్ గాంధీ 15 నియోజకవర్గాల్లో 25 సభలు.. ప్రియాంక అన్నే సెగ్మెంట్లలో 26 సభల్లో పాల్గొన్నారు. ఖర్గే నాలుగు నియోజకవర్గాల్లో 10 సభల్లో పాల్గొన్నారు. కర్నాటక సీఎం సిద్ధరామయ్య 4 సభలు, ఛత్తీస్‌గఢ్ సీఎం భూపేశ్ బఘేల్ 4 సభలకు హాజరయ్యారు. ఇక కర్నాటక డిప్యూటీ సీఎం డీకేశివకుమార్ 9సభల్లో పాల్గొన్నారు. కొన్నాళ్లుగా రాష్ట్రవ్యాప్తంగా వేర్వేరుగా ప్రచారం చేసిన రాహుల్, ప్రియాంక గాంధీలు..చివరి రోజున ఇద్దరూ కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. మంగళవారం మల్కాజిగిరిలో కాంగ్రెస్ అభ్యర్థి మైనంపల్లి హన్మంతరావు తరఫున రేవంత్‌తో కలిసి వారిద్దరూ భారీ రోడ్ షో నిర్వహించారు. రోడ్ షోకు భారీగా జనం తరలివచ్చారు. ఈ సందర్భంగా రేవంత్, ప్రియాంక, రాహుల్ సెల్ఫీలు తీసుకున్నారు. ప్రధాని మోదీ 8 బహిరంగ సభల్లో పాల్గొన్నారు. బీసీ ఆత్మగౌరవ సభ, ఎస్సీ వర్గీకరణ సభల కోసం ప్రత్యేకంగా హైదరాబాద్ వచ్చారు. ఆ తర్వాత మూడు రోజులు ఇక్కడే మకాం వేసి రోజుకు రెండు సభల్లో పాల్గొన్నారు. చివరగా హైదరాబాద్ లో రోడ్డు షోతో ప్రచారం ముగించారు. పార్టీ చీఫ్ జేపీ నడ్డా 14 సభల్లో, కేంద్ర హోం మంత్రి అమిత్ షా16 సభలు, రోడ్ షోల్లో పాల్గొన్నారు. యూపీ సీఎం యోగి 8 సభల్లో, అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ 13 సభల్లో మహారాష్ట్ర సీఎం షిండే 3 సభల్లో డిప్యూటీ సీఎం ఫడ్నవీస్ 6 సభల్లో పాల్గొన్నారు. కేంద్ర మంత్రులు రాజ్ నాథ్ సింగ్, నితిన్ గడ్కరీ, నిర్మలా సీతారామన్, స్మృతి ఇరానీ, ఇతర జాతీయ నేతలతో పాటు రాష్ట్ర నేతలు కిషన్ రెడ్డి, లక్ష్మణ్, డీకే అరుణ, బండి సంజయ్, ఈటల, రాజాసింగ్, రఘునందన్ రావు కూడా విస్తృతంగా ప్రచారం చేశారు. మొత్తంగా రాష్ట్రంలో త్రిముఖ పోటీ నెలకొంది. గత ఎన్నికలతో పోలిస్తే బిఆర్ఎస్‌కు కాంగ్రెస్ గట్టి పోటీని ఇస్తోంది.

# ప్రజలకోసం పనిచేసే వారినే ఎన్నుకోవాలి !

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరుగబోతున్న వేళ ఓటర్లు విజ్ఞతతో ఆలోచించి ఓటేయాలి. ముందుగా ఓటేయడానికి ఇల్లు వదిలి పోలింగ్ బూత్‌కు కదలాలి. ఓటు తమ ప్రజాస్వామ్య హక్కుగా గుర్తించాలి. ఎవరికి ఓటేయాలన్నది వారి ఇష్టం. అయితే ఓటు వేయడం మాత్రం బాధ్యతగా భావించాలి. ఈ దేశంలో ప్రజాస్వామ్యం బలపడాలంటే ప్రతి ఒక్కరూ ఓటేయడానికి రావాలి. ప్రలోభాలకు లొంగకుండా ఓటు కోసం కదలాలి. ఓ మంచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలన్నా..తాము కోరుకున్న అభ్యర్థి గెలవాలన్నా ఓటేయాలి. ఓటేస్తే నాకేంటని ఆలోచించే మదందబుద్ధి నుంచి బయటపడాలి. మన దేశంలో మనఓటు ద్వారానే ప్రభుత్వాలు ఏర్పడతాయని గుర్తించాలి. గెలిచిన వారు పాలకులుగా మనమీద స్వారీ చేయకుండా..వారిలో భయం ఉండాలంటే ప్రజలు చైతన్యం కావాలి. ప్రజల చెంతకు వచ్చి సమస్యలు విని పరిష్కారం చూపే వ్యక్తులను, పార్టీలనే గెలిపంచుకోవాలి. ప్రజలకు భయపడి పాలన చేసేవారిని గుర్తించి ఓటేయాలి.గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనతో పాటు, స్థానిక ఎమ్మెల్యేల పనితీరు, గుణగణాలను ఆలోచించాలి. ఏ పార్టీ అభ్యర్థి అయితే మనకు అందుబాటులో ఉంటాడో ఆలోచన చేయాలి. నిజానికి తెలంగాణ ప్రజలు మార్పు కోరుకుంటున్నారా లేక..ఉన్న పాలననే అంగీకరిస్తున్నారా అన్నది ప్రజలు ఇచ్చే తీర్పుతో తేలిపోనుంది. ప్రజలు తాము ఆలోచించి ఎవరైతే మంచి పాలన ఇస్తారో అన్నది వివేచించి ఓటేయాలి. పాలన మన కళ్లముందే ఉంది. కెసిఆర్ పాలన ఎలావుంటే..బిజెపి పాలన ఎలావుంటో అన్నదే ఇక్కడ గీటురాయి. వారు రాష్ట్రంలో, కేంద్రంలో మంచి చేస్తున్నారా లేదా అన్నది చూడాలి. కాంగ్రెస్ ప్రత్యేక తెలంగాణ ఇచ్చిన తరవాత అధికారంలో లేనేలేదు. కాబట్టి దాని గుణగణాలపై పదేళ్ల క్రితం ఉన్న డేటా ఆధారంగానే గుర్తించాలి. గత తొమ్మిదిన్నర సంవత్సరాలుగాటిఆర్ఎస్ తరవాత బీఆర్ఎస్ ప్రజావ్యతిరేక విధానాలు అవలంబించడమే గాకుండా నిరంకుశ నిజాం విధానాలను వంటబట్టించు కుంది. సిఎం ప్రజలను కలవాల్సిన అవసరం ఏముందన్న వితండవాదం తెరపైకి తెచ్చారు. ప్రజలు ఇలాంటి తలబిరుసు తనాన్ని భరించే స్థితిలో లేనట్లు స్పష్టమౌతున్నది. గత ఐదేండ్లలో జరిగిన పరిణామాలను ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు. దళితులకు సీఎం పదవి ఆశచూపి దగా చేయటం, దళితులకు మూడు ఎకరాలు అంటూ ఆర్భాటంగా ప్రకటించడం..ఇంటికో ఉద్యోగం అంటూ ప్రకటన చేయడం..తరవాత నేను అలా అనలేదని చెప్పడం పాలకులుగా ఉన్నవారికి తగదు. ఇచ్చిన హామీని అమలు చేయలేక పోతే ఎందుకు చేయలేకపోతున్నారో చెప్పాలి. ఎస్సీ,ఎస్టీలకు ఇచ్చిన హామీలు నీటిమూటలుగా మారాయి. ఇక బీసీ వర్గాలను గొర్రెలు, బర్రెలు, చేపల పంపిణీ పేరిట దుబరాకు తెరలేపారు. అన్నింటికి మించి విద్యార్థులకు, నిరుద్యోగులకు కేసీఆర్ సర్కారు చేసిన అన్యాయం అంతా ఇంతా కాదు. ఉద్యోగాల భర్తీపట్ల ప్రభుత్వం, టీఎస్పీఎస్సీ చూపిన నిర్లక్ష్యం గర్హనీయం. పేపర్ లీకులతో నిరుద్యోగుల జీవితాలతో ఆడుకున్న తీరుపై సర్వత్రా తీవ్ర నిరసన వ్యక్తం అవుతోంది. దీనిని సమర్థంగా ఎదుర్కోవడంలో ప్రభుత్వం విఫలం అయ్యింది. ఇతర రాష్ట్రాల్లో పేపర్ లీకేజీల వార్తలను ముందు పెట్టుకుని ఇక్కడి లేకేజీలను తక్కువగా చూపేందుకు యువరాజు నానా తంటాలు పడ్డారు. వ్యవసాయ విధానాల్లోనూ నిలకడ లేకపోవటం కూడా రైతన్నలను కలవరపరిచింది. రైతుబంధులో అవినీతి గురించి మాట్లాడడం లేదు. వందల ఎకరాలు ఉన్నవాళ్లకు, ఎన్ఆర్ఐలకు రైతుబంధు ఇచ్చి ప్రజాధనాన్ని కేసీఆర్ ప్రభుత్వం వృథా చేసింది. సన్నాలు పండించాలని ఒకసారి, వద్దని మరోసారి, వరివేస్తే ఉరే అంటూ అన్నదాతలను అయోమయానికి గురిచేసిన తీరు ప్రభుత్వ అసమర్థ విధానాలకు పరాకాష్టగా చెప్పుకోవాలి. పత్తి, పప్పు దినుసులు, చిరు ధాన్యాల సాగు విషయంలోనూ అస్పష్టత, ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో అలసత్వంతో రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. కొంతమంది రైతులు కళ్లాల వద్దే ప్రాణాలు విడిచారు. పంటల బీమా అమలు చేయాలని రైతాంగం ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా ప్రభుత్వం పట్టించుకోలేదు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో తక్షణ సహాయం అందక రైతులు విలవిలలాడిపోయారు. ఇక కౌలు రైతులను గుర్తించటానికి కూడా ప్రభుత్వం ఇష్టపడలేదు. ఆత్మహత్యలు చేసుకున్న రైతుల్లో కౌలుదారులే అధికసంఖ్యలో ఉండటం శోచనీయం. ధరణితో అవస్థల పాలైన కుటుంబాలు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ కాళ్ళరిగేట్టు తిరుగుతున్నా న్యాయం దొరకటం లేదు. బదిలీలు, పదోన్నతులు, రెగ్యులరైజేషన్ జరగక, సకాలంలో జీతాలు రాక ఉద్యోగులు నానా ఇక్కట్లకు గురయ్యారు. ఇవన్నీ ఎందుకు చెప్పాలంటే సమర్థ నాయకత్వం లేకపోవడం అన్నది గమనించాలి. తాము చేసిందే అభివృద్ధి, చేసిందే సరైనదన్న రీతిలో పాలకులు వ్యవహరించడం మూర్ఖత్వం. ప్రజలు ఏమను కుంటున్నారో తెలుసుకునే పరయత్నాలు ఈ పదేళ్లలో జరగలేదు. ప్రజలతో నేరుగా సంబంధాలు లేకుండా చేసుకున్నారు. కేవలం కార్పోరేట్, బిజనెస్ రంగాలతో మాత్రమే సంబంధాలు కొనసాగించారు. తెలంగాణ ఉద్యమ సమయం నుంచే కేసీఆర్ మోసాలను పసిగట్టడంలో తెలంగాణ మేధావి లోకం విఫలమైంది. ఇది తెలంగాణ సమాజానికి పెద్ద విషాదం. నూటికి 55 శాతం బీసీలు, మిగతా 30 శాతం ఎస్సీ, ఎస్టీలు కల్గిన తెలంగాణ సామాజిక సమూహాలను తప్పుదోవ పట్టించి, కేసీఆర్ కుటుంబ సభ్యులందరూ మోసాలకు పాల్పడ్డారు. పదేళ్లుగా వారే పదవులు అనుభవవిస్తున్నారు. తెలంగాణ ఉద్యమంలో కొట్లాడిన వారు అధికారానికి దూరంగా ఉండడం వల్ల ప్రజల ఆకాంక్షలు పాలనలో ప్రతిఫలించడం లేదు. కేసీఆర్ వర్గానికి చెందిన కొందరు మాత్రమే తెలంగాణలో కాంట్రాక్టర్లుగా, సబ్ కాంట్రాక్టర్లుగా అవతారమెత్తి ఆర్థికంగా, సామాజికంగా బలపడ్డారు. మిగతా తెలంగాణ సమాజమంతా మోసాలకు గురయ్యింది.

# పండితుల పామరులను అలరించిన విశిష్ట శైలి "సిరి వెన్నెలది"

### నవంబర్ 30... సిరివెన్నెల సీతారామశాస్త్రి వర్ధంతి



(రామ కిష్టయ్య సంగన భట్ల)
94405 95494

తెలుగు సంగీత సినీ వినీలాకాశంలో మూడున్నర దశాబ్దాల పైగా వేలాది పాటలు రాసిన చేయి తిరిగిన కలం శాశ్వతంగా ఆగి పోయి ఏడాది అయింది. గత సంవత్సరం నిమో నియా ( ఊపిరితిత్తుల క్యాన్సర్) కారణంగా హైదరాబాద్ కిమ్స్ హాస్పిటల్ లో నవంబర్ 24న చేరిన సిరివెన్నెల సీతారామ శాస్త్రి నవంబర్ 30 సాయంత్రం ఆరోగ్య పరిస్థితి ఒక్కసారిగా విషమించి ఈ లోకాన్ని వదిలి వెళ్ళిన నేపథ్యం విదితమే.సిరివెన్నెల సీతారామశాస్త్రి అసలు పేరు చంబోలు సీతారామ శాస్త్రి. విశాఖపట్నం జిల్లాలోని అనకాపల్లి మండలంలో మే 20, 1955 వ తేదీన వేద పండితుడు, డా.సి.వి.యోగి, అమ్మాజి (సుబ్బలక్ష్మి)కి జన్మించారు. అనకాపల్లి లోని మున్సిపల్ స్కూల్లో పాఠశాల విద్యను పూర్తి చేశారు. ఆంధ్రా మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్‌లో చేరి, ఆర్థిక ఇబ్బందుల కారణంగా చదువును మధ్యలోనే ఆపేశారు. అనంతరం అనకాపల్లిలోని బీఎస్ఎన్ఎల్ శాఖలో ఉద్యోగంలో చేరారు. ఆ సమయంలో ఆర్ఎస్ఎస్‌లో చురు కైన పాత్ర పోషించారు. చిన్నతనం నుంచి సందేశాత్మక, దేశభక్తి గీతాలు రాయడం సీతారామశాస్త్రికి అలవాటు. అనేక కార్యక్రమాల్లో సైతం సొంతంగా పాటలు రాసి అలపించేవారు. 1983లో కాకినాడలో జరిగిన ఒక కార్యక్రమంలో సినీ దర్శకుడు కళాతపస్వి కె.విశ్వనాథ్ ను కలిసే అవకాశం కలుగగా, సీతారామ శాస్త్రి ప్రతిభను కె.విశ్వనాథ్ గుర్తించారు. ఆయన చిత్రంలో పాటలు రాసే అవకాశం ఇచ్చారు. సిరివెన్నెల సినిమాలో ఆయన రాసిన పాటలు ఎంతగానో జనాదరణ పొందాయి. అలా ఆ సినిమా పేరే సీతారామశాస్త్రి ఇంటి పేరుగా మారింది. రాసిన తొలి పాట 'విధాత తలపున'కే నంది అవార్డు దక్కించుకున్న ఘనత సీతారామ శాస్త్రికే దక్కిన అరుదైన గౌరవం. మూడున్నర దశాబ్దాల సినీ జీవితంలో 800కు పైగా చిత్రాలలో, సిరివెన్నెల మూడు వేలకు పైగా పాటలు రాశారు. విరించినై బ్రహ్మను నేనై, విర చించితినీ రచించితిని, ఈ కవనంగా ఈ కవిత్వం, విపంచినైగా వీణనై, వినిపించితినీగా వినిపిస్తున్నా, ఈ గీతంగాఈ పాటను అంటూ బ్రహ్మగా కొంగ్రొత్త రచనల పరంపర సృష్టించి, చదువుల తల్లి వీణ సాయంతో వినిపించడం ప్రారంభించిన సిరివెన్నెల సినీ లోకానికి, తెలుగు ప్రేక్షకుల మదిలో నిలిచిపోయే సుమధుర గీతాలెన్నింటినో రాశారు. తెలుగులో ప్రజానీకానికీ తెలిసిన, తెలియని సాహిత్య ప్రక్రియలన్నింటినీ పలకరించారు, ప్రజల హృద యాలకు చేర్చారు సిరివెన్నెల.విధాత తలఉపున ప్రభవించినది... అంటూ ఆయన రాసిన మొదటి పాటే తెలుగు సినీ ప్రేక్షకుల గుండెల్లో ఆయనకు స్థానం సంపాదించి పెట్టింది. విధాత తలపున ప్రభవించినది..



సిరివెన్నెల రాసిన తొలి పాట. చివరిసారిగా.. అఖిల్ నటించిన మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచ్‌లర్ చిత్రంలో చిట్టి అడుగు అనే పాట రాశారు.

చాలా రకాల పాటలను రాసారు. సంప్రదాయ కవిత్వం దగ్గర నుండి జానపద గీతాల వరకు అన్నింటి లోనూ తన ప్రతిభను నిరూపించు కున్నారు. పండితుల నుండి పామరుల వరకు అందరిని అలరించిన విశిష్ట శైలి ఈయన సొంతం. తన ఉత్తమ విమర్శకు రాలిగా తన భార్య 'పద్మావతి'ని పేర్కొనే సీతారామశాస్త్రి తన గురువుగా శ్రీ వై. సత్యారావు అని చెప్పేవారు.ప్రముఖ తెలుగు, హిందీ చలనచిత్ర దర్శకుడు రామ్ గోపాల్ వర్మ దర్శకత్వంలో వచ్చిన గాయం తెలుగు సినిమాలో నిగ్గదీసి అడుగు ఈ సిగ్గు లేని జనాన్ని... అని పాట పాడే ప్రభావ శీలమయిన పాత్రలో తను వ్రాసి నటించగా, తను వ్రాసిన పాటకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నంది పురస్కారం లభించటం విశేషం. సినీ సాహిత్య రంగంలో చేసిన సేవలకు గానూ కేంద్ర ప్రభుత్వం సిరివెన్నెల సీతారామశాస్త్రిని పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది. ఆయన సినీ కెరీర్‌లో మొత్తం 11 నంది అవార్డులు, నాలుగు ఫిలింఫేర్ అవార్డులు అందు కున్నారు.ఉత్తమ గేయ రచయితగా :1986 సిరివెన్నెల, 1987 - శ్రుతిలయలు, 1988 - స్వర్ణకమలం, 1993 - గాయం, 1994 - శుభలగ్నం, 1995 - శ్రీకారం, 1997 - సింధూరం, 1999 - ప్రేమకథ, 2005 - చక్రం, 2008 - గమ్యం, 2013 - సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు చిత్రాలలో ఆయన రాసిన పాటలకు , ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ నంది పురస్కారాలు, ఆయనకు లభించాయి. 2005 - నువ్వొస్తా నంటే నేనొద్దంటానా, 2008 - గమ్యం - ఎంతవరకు, 2009 - మహాత్మ - ఇందిరమ్మ, 2015 - కంచె దక్షిణాది ఫిల్మ్‌ఫేర్ పురస్కారాలు పొందారు.

## సాహితీ ప్రేమికులకు ప్రత్యేకం




**' ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో రేపటి నుండి ప్రతి రోజు, " నేటి కథ" శీర్షికన ఒక కథను ప్రచురించనున్నామని తెలుపుట కు సంతోషిస్తున్నాం. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.com కు పంపవచ్చు...**

**-ఎడిటర్**

# గుడ్డు - చదువుకొన్న లడ్డు



ఒక గ్రామంలో పేరయ్య అనే బీద కూలీ ఉండేవాడు . కూలీకి వెళ్లి తిరిగివస్తున్న మార్గంలో సాధువు కనపడితే " సామీ , మా కస్టాలు ఎన్నడూ తీరుతుంది." అంటూ చేతులు జోడించి అడిగాడు.సాధువు తన దగ్గరున్న బాతునిచ్చాడు మరుసటి రోజు బాతుపెట్టిన బంగారు గుడ్డు చూసి పేరయ్య దంపతులు చాలా సంతోషించారు.ప్రతిరోజూ ఒక బంగారు గుడ్డు పెట్టసాగింది . భార్య భర్తల ఇద్దరిలో అత్యాశ పెరిగింది.పేరయ్యకొడుకు పేరు లడ్డు. జీవితం లడ్డులాగా తీయగా ఉండాలని ఆ పేరు పెట్టారు. "అమ్మా, నాన్నా, మా గురువుగారు చెప్పిన నీతికథ చేబుతాను" అంటూ బాతు బంగారు గుడ్డు కథ చెప్పడం ముగించిన తరువాత "ఇంటిలో జరుగుతున్నదంతా నాకు బాగా తెలుసు. అత్యాశకు వెళ్లకూడదని మీకు ఈ కథ చెప్పాను" అన్నాడు లడ్డు "మంచి సమయానికి కథ చెప్పావు లేకుంటే అత్యాశతో రేపు ఈ బాతును చంపేసేవారం." అన్నారు తల్లితండ్రులు. ప్రతిరోజూ బాతు పెట్టిన బంగారు గుడ్డుతో గుడిసెను పెంకుటింటిగా మార్చారు.ఒకరోజు బాతుకు అనారోగ్యం వచ్చింది. బార భర్తలిద్దరూ కలసి కొడుకు లడ్డుని అడిగారు. బాగా అలోచించి "పక్షివైద్యురాలు కోకిలమ్మ దగ్గరకు తీసుకెళ్లి చూపించండి .మీతోపాటు నేనూ వస్తాను"అన్నాడు లడ్డు కోకిలమ్మకు లోలోన అనుమానం కలిగి "ఈ బాతును ఇక్కడే వదిలి వెళ్ళండి. రేపు బాతు గుడ్డు పరీక్షించాలి " అంది. "ఈ బాతును వదిలి నేనుండలేను .నేనూ బాతుతో పాటూవుం టాను" అన్నాడు లడ్డు లడ్డు మాటలను అర్థం చేసుకొని " వాడికి ఈ బాతు అంటే ప్రేమ ఇక్కడే ఉండనివ్వండి " అన్నాడు పేరయ్య. మరుసటి రోజు ఉదయాన్నే పేరయ్య తెచ్చిన ఇంకొక బాతుగుడ్డును అక్కడ ఉంచి, బంగారు గుడ్డును పేరయ్యకు ఇచ్చి పంపాడు లడ్డు. కోకిలమ్మ వచ్చి మామూలు గుడ్డు చూడగానే నిరుత్సాహ పడింది. బాతును ఇవ్వవలసిన మందులు ఇచ్చి పంపింది. "లడ్డూ, చదువుకొన్ననీవు సలహా ఇవ్వడం వలన తెలివితక్కువ తనంతో బంగారుగుడ్డు పెట్టే బాతును చంపుకోలేదు అలాగే కోకిలమ్మ వైద్యురాలికి అనుమానము కలగకుండా వైద్యం చేయించాము." అంటూ తల్లి తండ్రులు మెచ్చుకొన్నారు.

**ఒట్ర ప్రకాష్ రావు, తిరుత్తణి,**
**09787446026**

# అధికారానికి దూరంగా ఉద్యమకారులు



### అధికారానికి దూరంగా ఉద్యమకారులు
### పాలనలో ప్రతిఫలించని ప్రజల ఆకాంక్షలు
### కుటుంబ పాలనతో పెరిగిన అవినీతి

**హైదరాబాద్,నవంబర్29 :** తెలంగాణ ఉద్యమంలో కొట్లాడిన వారు అధికారానికి దూరంగా ఉండడం వల్ల ప్రజల ఆకాంక్షలు పాలనలో ప్రతిఫలించడం లేదు. కేసీఆర్ వర్గానికి చెందిన కొందరు తెలంగాణలో కాంట్రాక్టర్లుగా, సబ్ కాంట్రాక్టర్లుగా అవతారమెత్తి, ఆర్థికంగా, సామాజికంగా బలపడ్డారు. క్షేత్రస్థాయిలో వనరులను దోచుకుంటున్నారు. కాలికి చెప్పులు లేని వారు కూడా కోట్లకు పడగలెత్తారు.

కొట్లాడిన తెలంగాణ సమాజమంతా మోసానికి గురవుతున్నా గళమెత్తితే... కేసులతో వేధించిన పాలకుల తీరును ఎండగట్టాల్సిందే. కెజి టూ పిజి నినాదాం ఓ మోసంగ ఆమారింది. గురుకులాల పేరుతో మభ్య పెట్టే ప్రయత్నం సాగుతోంది. ప్రయివేట్ విద్యకు పెద్దపీట వేయడంతో పాటు కార్పోరేట్ విద్యారంగానికి ప్రాధాన్యం ఇచ్చారు. విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాలు, పౌర సమాజం తీవ్రంగా నిరసిస్తున్నా పట్టించు కోవడం లేదు. విద్య, వైద్య రంగాలకు బడ్జెట్లో 10శాతంలోపు కేటాయించి ఆచరణలో పేద ప్రజలకు విద్య, వైద్యాన్ని దూరం చేస్తూ వచ్చారు. ప్రధానంగా పాఠశాలల మూసివేత పరాకాష్టకు చేరింది. వివిధ నివేదికల ద్వారా 2 లక్షల ఉద్యోగ ఖాళీలుఉన్నాయని ఉద్యమ సమయంలో కేసీఆరే చెప్పారు. కానీ,ఇప్పటి వరకు ఆయన ఒక్క డీఎస్సీ పెట్టకుండా లక్షా 30వేల ఉద్యోగాలను భర్తీ చేశామని బుకాయిస్తున్నారు. అయితే ఏ పరీక్షల ద్వారా ఏయే శాఖల్లో వారిని భర్తీ చేశారో చెప్పడం లేదు. విడుదల చేసిన నోటిఫికేషన్లు మొత్తం కోర్టుల చుట్టు చేరి ఆగిపోవడం...పరీక్ష నిర్వహణకు వచ్చినవి లీక్ కావడం, మళ్లీ పరీక్షలు ఆగిపోవడం జరిగితే ఉద్యోగాలు ఎలా భర్తీ చేశారో చెప్పరు. ఉద్యమం లో ఉద్యోగాలు వస్తాయని ఆశించిన యువతను కేసీఆర్ పదేపదే మోసం చేస్తూ వచ్చారు. అవినీతి క్రింది నుంచి పై స్థాయి దాకా వేళ్లూనుకున్నది. ప్రాజెక్టుల పేరుతో జరిగిన అవినీతికి కాళేశ్వరం సజీవ సాక్ష్యం. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం వద్ద లీకులు, కుంగి పోవటం వెనుక ఎన్ని వేలకోట్ల ప్రజా ధనం చేతులు మారిందో సమగ్ర విచారణ జరిగితేగాని వెల్లడి కాదు. మేడిగడ్డ బ్యారేజ్ వద్ద కుంగిన పిల్లర్లు రిపేర్ చేయటం వీలుకాదని మొత్తంగా పునాదుల నుంచి పున:నిర్మాణం చేయాలనీ 'డ్యాం సేఫ్టీ కమిటీ' ఇచ్చిన నివేదిక ప్రభుత్వాన్ని అభాసుపాలు చేసింది. అయినా వైఫల్యాలను స్వీకరించడానికి పాలకులు సిద్దంగా లేరు. ప్రతి పథకంలోనూ అధికార పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు వాటాలు కొల్లగొట్టారని ఆరోపణలు వెల్లువెత్తాయి. దళితబంధు పథకంపై సమీక్ష సమయంలో ఈ రహస్యం బట్టబయలైంది. ముఖ్యమంత్రే స్వయంగా అవినీతిని అంగీకరించినా మళ్ళీ వారినే ఎన్నికలలో అభ్యర్థులుగా నిలబెట్టడాన్ని ప్రజలు సహించలేక పోతున్నారు. అందుకే ప్రభుత్వ వ్యతిరేకత మార్పు మౌత్ టాక్‌తో దావానలంలా వ్యాపిస్తున్నది. మార్పు రావాలని కోరుకుంటున్న ప్రజలతో పౌరసంఘాలు మమేకమై ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేస్తున్నాయి. మార్పు తప్పదని సర్వేలు సైతం వెల్లడిస్తున్నాయి. నియంతృత్వ పాలనా విధానాలకు చరమగీతం పాడే సమయం వచ్చింది. తెలంగాణను ఇప్పటికే ఆరు లక్షల కోట్ల అప్పుల్లో ముంచాడు. ఇదంతా కేవలం అభివృద్ధి అన్నారు. మద్యం ద్వారా 36 వేల కోట్లు ఆదాయాన్ని రాబట్టుకొని తెలంగాణను తాగుబోతుల రాష్ట్రంగా మార్చారు. దీంతో పేద ప్రజల జీవితాల్లో ఆర్థికంగా, సామాజికంగా కోలుకోలేని దెబ్బపడింది. ప్రజలు పన్నుల ద్వారా వచ్చిన రాబడిని సహజ సంపదలను చిన్న సంఖ్యలో ఉన్న సామాజిక వర్గం కొల్లగొట్టింది. మొత్తానికి మొత్తంగా తెలంగాణ మిగులు రాష్ట్రాన్ని కోలుకోలేని అప్పుల కుప్పగా మార్చారు. అబద్దాలు ప్రచారం చేసుకుంటూ లోపాయికారిగా బీజేపీతో కుమ్మక్కై ఈ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకుల ఇండ్లపై ఐటి దాడులకు పాల్పడ్డారు.దీంతో ఈ రెండు పార్టీల మధ్య బంధం తెలంగాణ ప్రజలకు బహిర్గతమైంది. ఈ క్రమంలో ప్రజలు మళ్లీ మోసపోతారా అన్నది చూడాలి.

# జోరుగా ప్రలోభాల పర్వం

### ఓటు కోసం నానా తంటాలు
### మద్యంతో పాటు ప్యాకేజీలు
### ఓటుకు నోటు పంచుతున్న నేతలు

**హైదరాబాద్,నవంబర్29 :** ఎన్నికల ప్రచారం ముగియడంతో గతరాత్రి నుంచి ప్లరోభాల పర్వానికి తెరలేచింది. పోలింగ్‌కు కొద్ది గంటలే మిగిలి ఉండడంతో ఓటర్లను ప్రలోభ పర్చుకునే క్రమంలో పోటీచేస్తున్న అభ్యర్థులు అప్రమత్తమయ్యారు. మద్యంతో పాటు నోటను అప్పగించే ప్రక్రియలు సాగుతున్నాయి. కొన్నిచోట్ల బాహాటంగానే సాగింది. ఇందుకోసం నేతలు భారీగా మద్యాన్ని కొనుగోలు చేసి పంపిణీకి సిద్దంగా ఉంచారు. రహస్య ప్రాంతాల్లో డంప్ చేశారని తెలుస్తోంది. పోలింగ్ కు ఒకరోజు ముందుగా పంపిణీకి స్థానిక బూత్‌లెవల్ కార్యకర్తలకు బాధ్యతలు అప్పగించారు. తమను గెలిపించాలంటూ ఇన్నాళ్లూ పోటాపోటీగా ప్రచారం చేసిన అభ్యర్థులు.. ఇప్పుడు పోల్ మేనేజ్‌మెంట్‌పై ఫోకస్ పెట్టారు. ఓటర్లకు నగదు, మద్యం పంచడం షురూ చేశారు. కొన్ని నియోజక వర్గాల్లో పది రోజుల క్రితమే పంపకాలు మొదలుకాగా.. మంగళవారం రాత్రి నుంచి అన్ని నియోజకవర్గాల్లో జోరు పెంచారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు ఒకరిని మించి ఒకరు నగదు పంపిణీ చేస్తుండగా, కొన్ని నియోజకవర్గాల్లో మిగతా పార్టీలకు దీటుగా ఓటర్లను ఆకర్షించే ప్రయత్నాల్లో బీజేపీ క్యాండిడేట్లు బిజీగా ఉన్నారు. త్రిముఖ పోటీ ఉన్న నియోజకవర్గాల్లో ఒక్కో ఓటుకు సుమారు రూ.6 వేల నుంచి రూ.10 వేల వరకు ఇస్తున్నారు. ఎస్సీ,ఎస్టీ రిజర్వుడ్ నియోజక వర్గాల్లోనూ ఓటర్లకు ఈసారి భారీగా ముట్టజెప్తున్నట్లు సమాచారం. మంగళవారం సాయంత్రం నుంచి గురువారం సాయంత్రం వరకు మద్యం అమ్మకాలపై నిషేధం ఉండగా.. ఓటర్లను ప్రలోభపెట్టేందుకు అంతకుముందు గానే ప్లాన్ చేశారు. శివారు ప్రాంతాల్లో భారీ ఎత్తున లిక్కర్ పార్టీలు ఏర్పాటు చేశారు. ఇక పోతే మటన్‌కు ఆర్డర్స్ చేశారు. నగరానికి సంబంధించి ఐటీ ఉద్యోగులు, యూత్‌కు టూర్స్ ప్యాకేజ్ ఆఫర్ చేస్తుండగా.. గెలిచాక కోరిన ప్రాంతాలకు తీసుకెళ్తామని హామీలు ఇస్తున్నారు. ఐటీ, ప్రయివేట్ ఉద్యోగులు, ఇంజినీరింగ్ స్టూడెంట్లను గ్రూపులుగా చేసి టీమ్ లీడర్‌ను కూడా నియమించారు. అభ్యర్థుల కుటుంబ సభ్యులు, నమ్మకమైన అనుచరులకు ఈ బాధ్యతలు అప్పగించారు. సిటీ శివారు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన మందు పార్టీలకు ఓటర్లను తరలించేందుకు ప్రైవేట్ ట్రావెల్స్‌ను బుక్ చేశారు. ఇప్పటికే పలు రెస్టారెంట్లలో రూమ్స్ బుక్ చేశారు. వాటి పేరుతో టోకెన్స్ ఇస్తుండగా.. ఒక్కో టీమ్‌లో నలుగురిని, వీరిని మానిటరింగ్ చేసేందుకు బూత్‌లెవెల్ లీడర్లకు బాధ్యతలు ఇచ్చారు. హుజూరాబాద్, మునుగోడు ఉప ఎన్నికల్లో ఓటర్లకు పెద్ద ఎత్తున డబ్బులు ఇవ్వడంతో ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఆ ప్రభావం ఎక్కువగా కనిపిస్తున్నది. ఒక్కో అభ్యర్థి నుంచి రూ.5 వేల వరకు వస్తాయని ఓటర్లు ఆశిస్తున్నారు. గ్రేటర్‌శివార్లలోని నియోజకవర్గాల్లో ఒక్కో ఓటుకు అభ్యర్థులు రూ.5 వేలు ముట్టజెప్తున్నారు. ఏరియాలను బట్టి కొందరికి గిఫ్టులు కూడా ఇస్తున్నారు. గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్లలో పెద్ద ఎత్తున దావత్‌లు ఏర్పాటు చేశారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో మొదటి విడత అని ఒక్కో ఓటరుకు రూ.వెయ్యి చొప్పున పంపిణీ చేస్తున్నారు. ప్రత్యర్థులు పంచే మొత్తాన్ని బట్టి మరికొంత ఇచ్చేందుకు రెడీ అవుతున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని జనరల్ నియోజకవర్గాల్లో ఒక్కో ఓటుకు రూ.5 వేల నుంచి రూ.8వేల వరకు ఇస్తున్నారని ప్రచారం జరగుఉతోంది. కామారెడ్డిలో ఓటుకు 25వేలు ఇస్తున్నారన్న ప్రచారం సాగుతోంది.అన్ని చోట్ల మందుతో విందులు ఇస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్‌తో పాటు శివార్లలో త్రిముఖ పోటీ ఉన్న సెగ్మెంట్లలో 3 పార్టీల అభ్యర్థులు కలిపి కేవలం ఓటర్లకే రూ.200 కోట్లకు పైగా పంపిణీ చేసే అవకాశం ఉందని తెలుస్తున్నది. కొన్ని చోట్ల మొదటి విడతగా రూ.2 వేల చొప్పున ఇచ్చిన లీడర్లు.. బుధవారం రాత్రి మరో విడతగా ఇస్తామని చెప్తున్నారు. ఓటర్లకు నగదు పంపిణీలో బీఆర్ఎస్ అభ్యర్థులే ముందున్నారు. బీజేపీ అభ్యర్థులు కొన్ని చోట్ల పోటాపోటీగా ఇస్తున్నారు. కాంగ్రెస్ అభ్యర్థుల్లో ఎక్కువ మంది మంగళవారం రాత్రి నుంచే చెల్లింపులు మొదలు పెట్టారు. ఇన్నాళ్లు చేసిన ప్రచారం ఒక ఎత్తయితే పోల్ మేనేజ్‌మెంట్ ఒక ఎత్తు అని చెప్తున్నారు. ప్రధాన పార్టీల హెడ్ క్వార్టర్స్ నుంచి పెద్దలు అభ్యర్థులతో మాట్లాడుతూ ఎక్కడెక్కడ వీక్?ఉన్నారు.. ఎంత పంపిణీ చేయాలో ఎప్పటికప్పుడు సూచనలు ఇస్తున్నారు. హైదరాబాద్ నుంచి నగదు తరలింపునకు ఆటంకాలు ఉండటంతో స్థానికంగానే డబ్బులు సర్దుబాటు చేస్తున్నారు.

# ఓటును అమ్ముకోకు...

## గల్ఫ్ బాధితుడికి వైద్యం కోసం రూ. 1.32 లక్షలు సాయం



(రామకిష్టయ్య సంగన భట్ల)

**ధర్మపురి నవంబర్ 29 (ప్రజామంటలు):** కుటుంబ పోషణ కోసం దుబాయ్ వెళ్లిన ఓ గల్ఫ్ కార్మికుడు, సరైన ఉపాధి లేక ప్రదేశానికి తిరిగి రాగానే బ్రెయిన్ స్ట్రోక్ గురై కాలు చెయ్యి పడిపోగా మంచానికే పరిమితమైన గల్ఫ్ బాధితుడికి వైద్య ఖర్చులకోసం ఫేస్ బుక్ మిత్రులు రూ. 1.32 లక్షలు సాయం అందించి తమ ఔదార్యం చాటుకున్నారు.

### సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి:

ధర్మపురి మండల కేంద్రంలోని నక్కల పేట గ్రామానికి వెళ్లే ఇందిరమ్మ కాలనీకి చెందిన దివిటి సురేష్ తన భార్య కూతురుతో కలిసి నివసిస్తుండగా కొన్ని నెలల క్రితం సురేష్ ఉపాధి కోసం దుబాయ్ వెళ్ళాడు. అక్కడ సరిగా పని దొరకకపోవడంతో 6 నెలల క్రితం తిరిగి ఇంటికి వచ్చాడు. దురదృష్టవశాత్తు 4 నెలల క్రితం సురేష్ కు బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో ఓ కాలు, చెయ్యి పడిపోగా మంచానికే పరిమితమయ్యాడు. వైద్యం కోసం సుమారు నాలుగు లక్షలు అప్పు చేసినప్పటికీ పూర్తిగా నయం కాలేదు. చివరికి డబ్బులు లేక వైద్య సేవలు నిలిచిపోయాయి. బాధితుడి కుటుంబ దిన స్థితిని ధర్మపురికి చెందిన సామాజిక సేవకుడు రేణికుంట రమేష్ స్థానికుల ద్వారా తెలుసుకొని సురేష్ కు వైద్య ఖర్చులకోసం సాయం అందించాలని కోరుతూ నవంబర్ 4న ఫేస్ బుక్ లో పోస్ట్ చేసాడు. రమేష్ చేసిన ఫేస్ బుక్ పోస్టుకు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎన్నారైలు, కర్ణాటక రాష్ట్రానికి చెందిన బళ్లారి మిత్రులు స్పందించి సురేష్ భార్య రాణి బ్యాంక్ ఖాతాకు రూ. 1.32 లక్షలు పంపించారు. దాతలు అందించిన విరాళాలను రమేష్ స్థానిక యూనియన్ బ్యాంక్ మేనేజర్ రవితేజ చేతుల మీదుగా సురేష్ భార్యకు అందించారు.

## హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఎన్నికలకు సర్వం సిద్ధం






**జమ్మికుంట నవంబర్ 29 (ప్రజామంటలు):** తెలంగాణ రాష్ట్రంలో గురువారం జరగబోయే హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికలకు సంబంధించి కార్యక్రమాలన్నీ పూర్తయ్యాయి. హుజురాబాద్ నియోజకవర్గంలో మొత్తంగా 305 పోలింగ్ కేంద్రాల ద్వారా 2 లక్షల 49 వేల 558 మంది ఓటు హక్కు కలిగి ఉన్నారు. ఇందులో పురుషుల సంఖ్య 1,21,809బీ మహిళల సంఖ్య 1,27,743బీ ట్రాన్స్ జెండర్ 6 గురు ఉన్నారు. నియోజకవర్గంలో మొత్తం పోలింగ్ బూతుల సంఖ్య 35 కాగా ఇందులో సమస్య ఆత్మక పోలింగ్ బూతులు 82 ఉన్నాయని అధికారులు తెలిపారు. సెక్టోరియల్ అధికారులు 30 మంది కాగా, బ్యాలెట్ యూనిట్లు 610, అదనపు బ్యాలెట్ యూనిట్లు 153, వివి ప్యాడ్స్ 305, అదనపు వివి ప్యాడ్స్ 122, కంట్రోల్ యూనిట్స్ 383, పోలింగ్ సిబ్బంది 1220, పోలీస్ సిబ్బంది 600, మైక్రో అబ్జర్వర్స్ 55 ఎన్నికలు శాంతియుతంగా, సజావుగా, ఓటర్లు ఎలాంటి భయభ్రాంతులకు గురి కాకుండా తమ ఓటు హక్కును వినియోగించుటకు సర్వం సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. ఎన్నికల కేంద్రాల్లో ఓటర్లకి ప్రథమ చికిత్స కేంద్రం, ఓటరు సహాయ కేంద్రాలు, తాగునీరు సదుపాయాలు కల్పించారు.

## పటిష్ట బందోబస్త్ మధ్య పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంలు తరలింపు

### జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్




**జగిత్యాల నవంబర్ 29 (ప్రజామంటలు):** శాసన సభ ఎన్నికల సందర్భంగా కోరుట్లలో ఎస్ఎఫ్ఎస్ స్కూల్లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల నుండి ఆయా ప్రాంతాలకు ఎన్నికల సామగ్రి పటిష్ట బందోబస్త్ మధ్య తరలించడం జరిగిందని ఎస్పి తెలిపారు. ఎలాంటి ఆవాంఛనీయ సంఘటనలు జరగకుండా 94 రూటు మొబైల్స్ ను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ఈ సందర్భంగా ఎన్నికల అబ్జర్వర్ శ్రీరాజీవ్ రంజన్ మీనా తో మాట్లాడి ఎన్నికల సామాగ్రి డిస్ట్రిబ్యూషన్ గురించి తీసుకుంటున్న చర్యల గురించి ఆరా తీశారు. ఎస్పీ వెంట అడిషనల్ ఎస్పీ భీమ్ రావు, డిఎస్పి రవీంద్ర రెడ్డి ఉన్నారు.

### భవిష్యత్తును నాశనం చేసుకోకు...

### అభ్యర్థులు ఇచ్చే డబ్బుల కోసం ఎదురుచూస్తున్న 'జనం'

**జమ్మికుంట నవంబర్ 29 (ప్రజామంటలు):** ఎన్నికలు వచ్చిందంటే డబ్బు, మద్యం, ఏరులై పారుతున్నాయి. ఓటర్లను ఆకట్టుకోవడానికి వివిధ రకాల ప్రలోభాలకు గురి చేస్తున్నారు. ఓటు వేయించుకునే వరకే అభ్యర్థులు గడపగడపకు తిరుగుతూ దండాలు పెడుతూ దగ్గరవుతున్నారు. ఓటు బాక్సులో పడి నంక ఓటర్ దిక్కు చూడడం లేదు. అయితే దీనంతటికి కారణం డబ్బు. ప్రజలు ఎప్పుడైతే డబ్బుకు ఆశపడి ఓటు వేస్తున్నారో అప్పుడే నాయకుడి దృష్టిలో చులకన భావం ఏర్పడుతుంది. ప్రస్తుత రోజుల్లో రాజకీయం ఒక వ్యాపారంలా మారిపోయింది. ఒక్క ఎమ్మెల్యే అభ్యర్థి 100 కోట్లు పెట్టి గెలిచి వేల కోట్ల సంపద కూడగట్టుకుంటున్నాడు. అంటే రాజకీయ వ్యాపారం ఎంత లాభసాటిగా ఉందో మనం అర్థం చేసుకోవచ్చు. కాబట్టి ప్రజల భవిష్యత్తు మారాలి అంటే, ప్రజల అవసరాలు తీరాలంటే, ప్రజలు నీతి నిజాయితీతో ఓటు వేసి నాయకుడి గల్ల పట్టి పని చేయించుకునే పరిస్థితి ఉన్నప్పుడే మన భవిష్యత్తు మారుతుంది.

### కాబట్టి ప్రజలారా...

ఓటును అమ్ముకోకు.. నీ భవిష్యత్తును నాశనం చేసుకోకు.. అంటూ ప్రముఖ విద్యావేత్త, రాజకీయ విశ్లేషకులు, జర్నలిస్టు మహమ్మద్ అంకుష్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



## స్వామి వారికి వెండి విగ్రహం నామాలు


### శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి వెండి పాదాలతో తయారు చేసిన ప్లేట్ సమర్పించిన దామెర రాంసుధాకర్ రావు సంఘమిత్ర దంపతులు



**ధర్మపురి నవంబర్ 29 (ప్రజామంటలు):** హైదరాబాద్ లో నివసిస్తున్న ధర్మపురి కి చెందిన దామెర రాంసుధాకర్ రావు సంఘమిత్ర దంపతులు శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వారికి వెండి విగ్రహం నామాలు మరియు శ్రీ వెంకటేశ్వర స్వామి వారికి వెండి పాదాలతో తయారు చేసిన ప్లేట్ సుమారు రెండు కిలోల వెండితో సుమారు రూ. 2,00,000 విలువతో ఈరోజు దేవస్థానమునకు సమర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో దేవస్థానం రెనవేషన్ కమిటి చైర్మన్ ఇందారపు రామయ్య, వేదపండితులు బొజ్జ రమేష్ శర్మ, ముత్యాల శర్మ, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, ముఖ్య అర్చకులు రమణయ్య, అభిషేకం పురోహితులు బొజ్జ సంతోష్ కుమార్, రాజగోపాల్ పాల్గొన్నారని కార్యనిర్వహణాధికారి తెలిపారు.

## ఓమన్ దేశంలో రోడ్డు ప్రమాదం

### రాఘవ పట్నం వాసి సికిరి తిరుపతి మృతి



**జగిత్యాల నవంబర్ 29 (ప్రజామంటలు):** గొల్లపల్లి మండలం రాఘవ పట్నం గ్రామంకు చెందిన సికిరి తిరుపతి ఉపాధి నిమిత్తం కొరకు ఓమన్ దేశానికి గత పది సంవత్సరాల క్రితం వెళ్ళాడు. 28 తేదీన రోడ్డుపై వెళ్తూ ఆగిన వాహనాన్ని ట్రక్కు వేగంగా వచ్చి ఢీకొట్టింది. వాహనంలో ఉన్న నలుగురు వ్యక్తులు అక్కడికక్కడనే మరణించారు. అందులో ఒకరు బంగ్లాదేశ్ వాసి కాగా ముగ్గురు భారతీయులు. అందులో ఒకరైన సికిరి తిరుపతి డ్రైవింగ్ చేస్తూ సైడ్లో పార్క్ చేసాడు. ఆగి ఉన్నఆ వాహనాన్ని ట్రక్కు ఢీకొట్టిందని సంజీవ్ అనే వ్యక్తి ఆ కంపెనీలో ఫోర్ మెన్ కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. సమాచారం తెలుసుకున్న తమ్ముడు ఆంజనేయులు ఆందోళనకు గురయ్యారు. ఇట్టి విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పగా రాత్రి రెండు గంటలకు నాకు (చాంద్ పాషా) సమాచారం వచ్చింది. ఉదయం ఎమ్మెల్సీ టీ జీవన్ రెడ్డి ని బాధితులు కలిసి వాళ్ళ అన్నయ్య మృతదేహాన్ని తెప్పించాలని కోరగా వారు వెంటనే ఫోన్ చేసి చాంద్ పాషా కు సమాచారం అందించారు. అప్పటికే బీర్పూర్ మండలం ఆంజనేయులు పోలీసులకు ఉద్యోగం చేస్తూ అన్నయ్య చనిపోయాడని చాంద్ పాషా కు చెప్పారు. కుటుంబం ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న సమయంలో అన్నయ్య మరణం ఆ కుటుంబానికి ఎంతో తీవ్ర విషాదంలో ఉన్నారు. తిరుపతికి ఇద్దరు కొడుకులు, భార్య, అమ్మానాన్న ఉన్నారు. విషయం తెలుసుకున్న చాంద్ పాషా వెంటనే కంపెనీ ఫోర్ మెన్ తో మాట్లాడి వాస్తవాలు తెలుసుకుని డాక్యుమెంట్స్ తయారుచేసి ఇండియన్ ఎంబస్సి కంపెనీ యాజమాన్యానికి రాష్ట్ర ఎన్నారై సెల్ సెక్షన్ ఆఫీసర్ చిట్టి బాబు కి పంపడం జరిగింది. వెంటనే ఆ కుటుంబం ఆదుకోవాలని 5 లక్షల రూపాయలు ఎన్ఆర్ఐ ఫండ్ కింద ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని టిపిసిసి ఎన్నారై కన్వీనర్ షేక్ చాంద్ పాషా డిమాండ్ చేస్తున్నారు.




జగిత్యాల జిల్లా కేంద్రం లోని గౌతమ మోడల్ స్కూల్లో అసెంబ్లీ ఎన్నికలకు గాను దివ్యాంగుల కోసం ఆదర్శ పోలింగ్ కేంద్రాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. దీనికి గాను ప్రత్యేకంగా పోలింగ్ బూత్ ముందు బెలూన్లతో అలంకరించారు.

## ఓటుకు నోటు రాజకీయాలకు స్వస్తి పలకాలి



**భీమదేవరపల్లి నవంబర్ 29 (ప్రజామంటలు):** ప్రపంచంలోనే అతి పెద్ద ప్రజాస్వామ్య దేశం భారతదేశంలో ఓటు ప్రజాస్వామ్యానికి గుండెకాయ లాంటిది. ఓటు విలువ వెల కట్టలేనిది. మనం వేసే మన భవిష్యత్ తరాలకు స్ఫూర్తిగా ఉండాలి. మనం వేసే ఓటు రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలను ఏర్పరుస్తుంది. అందుకే ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును ఖచ్చితంగా వినియోగించు కోవాలని యువ న్యాయవాది తాళ్లపల్లి మధుకర్ బుధవారం అన్నారు. వృత్తిలో భాగంగా ఏ ప్రాంతంలో ఉన్న సరే, మీ యొక్క ఓటు ఏ పోలింగ్ కేంద్రంలో ఉందో తెలుసుకొని అక్కడికెళ్లి ఓటు హక్కును వినియోగించుకోవాలని అన్నారు. ఎవరి ప్రలోభాలకు లొంగకుండా నచ్చిన అభ్యర్థికి ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఓటుకు నోటు రాజకీయాలకు స్వస్తి పలికి ప్రజాస్వామ్య దేశంలో ప్రజలే ముఖ్యమని పాలకులకు తెలియపరచే విధంగా పౌరులు నడుచుకోవాలని విజ్ఞప్తి చేశారు.


## ఓటు వేయడానికి తెలంగాణకు వస్తున్న 'ముంబై వలసజీవులు'



**ముంబై నవంబర్ 29 (ప్రజామంటలు):** తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో తమ అమూల్యమైన ఓటు వేయడానికి ముంబై వలసజీవులు తమ స్వగ్రామాలకు బయలు దేరారు. ప్రతి పార్లమెంటు, అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఓటును సద్వినియోగం చేసుకోవడం పరిపాటైంది. వలసజీవుల బత్రుకులు ఒక కాలు కన్న ఊరిలో ఉంటే, రెండో కాలు పొట్టకోసం పట్టణం లోవుంటుంది. అందులో భాగంగా పెద్దపల్లి జిల్లాకు చెందిన గంగపుత్రులు బెస్తపల్లి, దుబ్బపల్లి, చందనాపూర్, రామగుండం, లింగాపురం, వేమునూరు, ఎల్లంపల్లి, శేట్పల్లి గ్రామాల ప్రజలున్నారు. వీరేకాక గతవారం నవీముంబై, భివండి, ముంబై నుంచి బయలుదేరిన తెలంగాణ ప్రజలకు ప్రత్యేక ట్రైన్ లేక అనేక ఇబ్బందులను ఎదురుకొంటున్నరు. కొమరంభీం, మంచిర్యాల, పెద్దపల్లి, ఉమ్మడి కరీంనగర్, ఉమ్మడి నిజామాబాద్, వరంగల్, మెహబూబ్ నగర్ తదితర జిల్లాలో ప్రత్యేక ట్రైన్ లేక చాలా ఇబ్బందులతో ప్రయాణం చేసి చేరుకున్నారు. వారాంతపు "ఆనందవనం" ట్రైన్ ఎల్.ఎల్.టి టెర్మినల్ నుంచి కాజీపేట జంక్షన్ వరకు నడ్చేది. అది 2020 నుంచి బంద్ అయినందువల్ల జనం తల్లడిల్లి పోతున్నారు. పలితం కుటుంబ సభ్యులు చంటి పిల్లలతో సహా రెండు ట్రైన్ల ను బదలీ చేయాల్సి వస్తుందని వాపోతున్నారు. ఎలక్షన్ల అనంతరం అట్టి రైలును తిరిగి ప్రారంభించాలని వారు రాజకీయ పార్టీలను కోరుతున్నారు. మరి ప్రత్యేకంగా మంగళవారం కాజిపేట వలస జీవులు ముంబై, పుణె నుంచి "విశాఖపట్నం ఫాస్ట్" రైల్లో భారీ సంఖ్యలో సఫర్ లో వున్నారని తెలుస్తుంది.

## ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న విద్యాశాఖ సిబ్బందికి డిసెంబర్ 1న సెలవు

**హైదరాబాద్ నవంబర్ 28 (ప్రజామంటలు):** ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న విద్యాశాఖ సిబ్బందికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం డిసెంబర్ 1వ తేదీన సెలవు ప్రకటించింది. పాఠశాల మరియు విద్యాశాఖ, సాంకేతిక, ఉన్నత విద్యా శాఖల సిబ్బందికి డిసెంబర్ 1 వ తేదీన స్పెషల్ క్యాజువల్ లీవ్ గా ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.




మేడ్చల్ జిల్లా మేడిపల్లి మండలం చెంగిచెర్ల చౌరస్తాలో తన కార్ లో డబ్బుల సంచులతో దొరికిన ఎక్సైజ్ సి.ఐ. అంజిత్ రావు. అతనిని సస్పెండ్ చేసిన ఎలక్షన్ కమిషన్

# ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి

### జగిత్యాలలో 254 పోలింగ్ స్టేషన్లు

### ఆర్డీవో, రిటర్నింగ్ అధికారి: నరసింహమూర్తి



**జగిత్యాల నవంబర్ 29 (ప్రజామంటలు):** ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తామని, జగిత్యాలలో 254 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని జగిత్యాల ఆర్డీవో, రిటర్నింగ్ అధికారి నరసింహమూర్తి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతి ఓటరు తమ ఓటు హక్కును స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని, జగిత్యాల నియోజకవర్గంలో ఎన్నికల విధులు నిర్వహించడానికి 1200 మంది సిబ్బందిని నియమించడం జరిగిందని, 178 పోలింగ్ స్టేషన్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశామని, ఓటర్ స్లిప్ తో పాటు 12 రకాల గుర్తింపు కార్డులో ఏదైనా ఒక గుర్తింపు కార్డుతో ఓటు హక్కు వినియోగించుకోవచ్చని తెలిపారు. జగిత్యాల నియోజకవర్గంలో ఐదు ఉమెన్ పోలింగ్ స్టేషన్లు, ఒక పిడబ్ల్యూడిపోలింగ్ స్టేషన్, యూత్ పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశామని తెలిపారు. అనంతరం జగిత్యాల డిఎస్పి వెంకట్ స్వామి మాట్లాడుతూ జగిత్యాల నియోజకవర్గంలో ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామని, ఏమైనా ఇబ్బందులు ఉంటే స్థానిక పోలీస్ స్టేషన్ లో, డయల్ 100కు సమాచారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల పట్టణ ఇన్స్పెక్టర్ నటేష్, ఎస్ఐలు, పోలింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


# డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లోకి మా ఊరి పొలిమేర-2

ఓటీటీ ప్రేక్షకులు ఎప్రుడెప్పుడా అని ఎదురు చేస్తున్న సినిమా మా ఊరి పొలిమేర 2 సినిమా డిజిటల్ స్ట్రీమింగ్‌కు సిద్ధమవుతున్నది. నవంబర్ 3న థియేటర్లలో విడుదలైన ఈ సినిమా నాలుగు వారాలైనప్పటికీ ఇంకా విజయవంతంగా నడుస్తూ దాదాపు రూ50 కోట్ల వరకు కలెక్షన్లు రాబట్టి సరికొత్త రికార్డులు తిరగరాసింది. మిస్టరీ థ్రిల్లర్ జానర్‌లో వచ్చిన ఈ పొలిమేర మొదటి భాగం ఓటీటీలో విడుదలవగా మంచి రెస్పాన్స్ వచ్చింది. దీంతో రెండో భాగాన్ని థియేటర్లలో విడుదల చేయగా ఓటీటీని మించి ఆదరణను తెచ్చుకుంది. మౌత్‌టాక్ బాగా స్ప్రెడ్ అవడంతో పోటీ చిత్రాలను సైతం తట్టుకుని విజయదుందుబి మ్రోగించింది. అయితే ఇప్పుడు ఈ మా ఊరి పొలిమేర 2 ఉ సినిమా రిలీజై 4 వారాలు దాటి 30 రోజులు కావస్తుండడంతో సినిమాను ఓటీటీలోకి తేచ్చేందుకు డిస్నీ ప్లస్ హాట్‌స్టార్ ప్రయత్నాలు చేస్తున్నది. డిసెంబర్ 8న గానీ 15 నుంచి గానీ స్ట్రీమింగ్ చేయనున్నట్లు సోషల్ మీడియాలో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి.




## సలార్ విడుదలకు సన్నాహాలు

### ఆకట్టుకుంటున్న ప్రచార చిత్రాలు




గ్లోబల్ స్టార్ హీరో ప్రభాస్ కాంపౌండ్ నుంచి వస్తున్న సలార్ యాక్షన్ థ్రిల్లర్ జోనర్‌లో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని కేజీఎఫ్ ఫేం ప్రశాంత్ నీల్ డైరెక్ట్ చేస్తున్నాడు. సలార్ రెండు పార్టులుగా తెరకెక్కుతుండగా? డిసెంబర్ 22న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. విడుదల తేదీ దగ్గర పడుతున్న నేపథ్యంలో ఇంట్రెస్టింగ్ న్యూస్ ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. సలార్‌లో పృథ్వీరాజ్ సుకుమారన్ వరదరాజ మన్నార్ ది కింగ్ పాత్రలో నటిస్తుండగా.. వరదరాజ మన్నార్ ది కింగ్ లుక్ ఇప్పటికే నెట్టింట హల్ చల్ చేస్తోంది. కాగా పార్టు 1లో పృథ్వీరాజ్ సుకుమారన్, ప్రభాస్ స్నేహితులుగా, శత్రువులుగా కనిపిస్తారని చెప్పాడు డైరెక్టర్ ప్రశాంత్ నీల్. అంతేకాదు సలార్‌కు కేజీఎఫ్‌తో ఎలాంటి కనెక్షన్ ఉండదని కూడా చెప్పాడు. సలార్ పార్టు 2 ఎప్పుడు మొదలవుతుందని ప్రశాంత్ నీల్‌ను అడుగగా.. అది లాజిక్‌తో కూడిన విషయమని.. సలార్ 2 ఎప్పుడు సెట్స్‌పైకి వెళ్తుందో చెప్పలేనన్నాడు. ఇదిలా ఉంటే ప్రశాంత్ నీల్ సలార్ తర్వాత జూనియర్ ఎన్టీఆర్‌తో ఎన్టీఆర్ 31ను సెట్స్‌పైకి తీసుకెళ్లేందుకు రెడీ అవుతున్న విషయం తెలిసిందే. మార్చి 2024లో ఈ మూవీ సెట్స్‌పైకి వెళ్లనున్నట్టు సమాచారం. సలార్‌ను కేరళలో మాలీవుడ్ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ హోం బ్యానర్ పృథ్వీరాజ్ ప్రొడక్షన్స్ హౌజ్ విడుదల చేస్తుంది. ఇక నైజాంలో టాలీవుడ్ పాపులర్ ప్రొడక్షన్ బ్యానర్ మైత్రీ మూవీ మేకర్స్ సలార్‌ను విడుదల చేస్తుండగా.. అనిల్ తడని నార్తిండియాలో విడుదల చేస్తోంది. ఓవర్సీస్‌లో సలార్‌ను విడుదల చేస్తోంది. సలార్ ట్రైలర్ డిసెంబర్ 1న రాత్రి 7:19 గంటలకు లాంఛ్ చేయనున్నట్టు ఇప్పటికే మేకర్స్ ప్రకటించారు. శృతిహాసన్ హీరోయిన్‌గా నటిస్తోంది. సలార్ నుంచి ఇప్పటికే లాంఛ్ చేసిన టీజర్‌లో గూస్‌బంప్స్ తెప్పించే విజువల్స్ సినిమాపై అంచనాలు పెంచేస్తున్నాయి. హోంబలే ఫిలిమ్స్ బ్యానర్‌పై విజయ్ కిరగందూర్ తెరకెక్కిస్తున్న సలార్ తెలుగు, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది.

## నితిన్‌కు అరుదైన బహుమతి

### సంతకం చేసిన టీ షర్ట్ పంపిన క్రికెటర్ ధోనీ




టాలీవుడ్ యాక్టర్ నితిన్ నటిస్తోన్న చిత్రాల్లో ఒకటి ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్ . యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా వస్తోన్న ఈ చిత్రానికి వక్కంతం వంశీ దర్శకత్వం వహిస్తున్నాడు. క్యూటీ గాళ్ శ్రీలీల ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. ఇప్పటికే ఈ మూవీ నుంచి లాంఛ్ చేసిన డేంజర్ పిల్లా, బ్రష్ వేసుకో పాటలు మ్యూజిక్ లవర్స్‌ను ఇంప్రెస్ చేస్తున్నాయి. డిసెంబర్ 8న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానున్న ఈ నేపథ్యంలో నితిన్ టీం ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది. కాగా టీమిండియా మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీ తన సైన్ చేసి ఉన్న టీ షర్ట్‌ను నితిన్‌కు బహుమతిగా అందించాడు. అంతేకాదు ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్ సినిమా విజయం సాధించాలని శుభాకాంక్షలు కూడా తెలియజేశాడు. సర్‌ప్రైజ్ గిఫ్ట్‌పై నితిన్ స్పందిస్తూ.. ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్ నుంచి ఎక్స్‌ట్రా ఆర్డినరీ బహుమతి. ఈ కానుక అందించినందుకు ధన్యవాదాలు ధోనీ. లవ్ యూ.. అంటూ ట్వీట్ చేశాడు. టీషర్ట్ పట్టుకొని దిగిన స్టిల్ ఇప్పుడు నెట్టింట హల్ చల్ చేస్తోంది. ఇంతకీ ధోనీని నితిన్ ఎప్పుడు.. ఎలా కలిశాడంటూ తెలుసుకునే ప్రయత్నంలో బిజీ అయిపోయారు నెటిజన్లు. కామెడీ యాక్షన్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తోంది. యాంగ్రీ యంగ్ మ్యాన్ డాక్టర్ రాజశేఖర్ కీలక పాత్రలో నటిస్తున్నాడు. ఈ మూవీని నితిన్ హోం బ్యానర్ శ్రేష్ఠ్ మూవీస్‌పై సుధాకర్ రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ మూవీలో నితిన్ స్మగ్లర్‌గా కనిపించనున్నట్టు సమాచారం. నితిన్ మరోవైపు వెంకీ కుడుముల డైరెక్షన్‌లో ఓ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడని తెలిసిందే. ఈ మూవీని మైత్రీ మూవీ మేకర్స్ పై నవీన్ యేర్నేని, వై రవి శంకర్ సంయుక్తంగా తెరకెక్కిస్తుండగా.. జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నాడు.

## వార్ ప్రాజెక్టులో జూనియర్ ఎన్టీఆర్

### యాక్షన్ సీక్వెల్ స్టిల్స్ విడుదల





బాలీవుడ్ స్టార్ డైరెక్టర్ అయాన్ ముఖర్జీ బ్యానర్‌లో తెరకెక్కిస్తున్న చిత్రం వార్ 2. హృతిక్ రోషన్ , టైగర్ ష్రాఫ్ కాంబోలో వచ్చిన వార్‌కు కొనసాగింపుగా వస్తున్న ఈ ప్రాజెక్టులో జూనియర్ ఎన్టీఆర్ జాయిన్ కావడంతో అంచనాలు అమాంతం పెరిగిపోయాయి. ఇటీవలే వార్ 2 షూటింగ్ స్పెయిన్‌లో నిర్వహించినట్టు అప్‌డేట్ వచ్చింది. ఈ షెడ్యూల్‌లో షూట్ చేసిన యాక్షన్ సీక్వెన్స్‌కు సంబంధించిన స్టిల్స్ ఇప్పటికే నెట్టింట హల్ చల్ చేస్తున్నాయి. తాజాగా ఈ సినిమా ఎప్పుడు ప్రేక్షకుల ముందుకు వస్తుందనే దానిపై క్లారిటీ ఇచ్చారు మేకర్స్. ఈ చిత్రాన్ని 2025 ఆగస్టు 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్టు ప్రకటించారు. ఏక్తా టైగర్, టైగర్ జిందా హై, వార్, పఠాన్, టైగర్ 3 సినిమాల తర్వాత వస్తున్న ఆరో ప్రాజెక్టు కావడం విశేషం. ఇప్పటివరకు వచ్చిన సినిమాలన్నింటి బాక్సాఫీస్ వద్ద మోత మోగించాయి. టైగర్ 3 ఎండింగ్‌లో వార్ 2 గ్లింప్స్ కూడా ప్లే చేయగా.. ప్రేక్షకులు థ్రిల్‌కు గురవుతున్నారు. అయాన్ ముఖర్జీ మరోవైపు బ్రహ్మాస్త్ర ఫ్రాంఛైజీ పనులపై కూడా ఫోకస్ పెట్టాడని తెలిసిందే. జూనియర్ ఎన్టీఆర్ ప్రస్తుతం దేవర చిత్రంలో నటిస్తున్నాడని తెలిసిందే. కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ దశలో ఉంది. దేవరతో బాలీవుడ్ భామ జాన్వీకపూర్ టాలీవుడ్ ఎంట్రీ ఇస్తోంది. ఈ చిత్రంలో పాపులర్ మలయాళ యాక్టర్ ÷న్ టామ్ చాకో కీలక పాత్ర పోషిస్తున్నాడు. మల్టీ లింగ్యువల్ ప్రాజెక్ట్‌గా వస్తున్న దేవర 2024 ఏప్రిల్ 5న థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ చిత్రాన్ని ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ బ్యానర్లపై సుధాకర్ మిక్కిలినేని, కొనరాజు హరికృష్ణ సంయుక్తంగా తెరకెక్కి స్తున్నారు.

## ఓటిటిలోకి వస్తున్న కీడాకోలా

ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు మరో కొత్త సినిమా సిద్ధమైంది. నవంబర్ 3న థియేటర్లలో విడుదలై మిక్స్ డ్ టాక్ తెచ్చుకున్న కీడా కోలా సినిమా ఓటీటీ విడుదలకు రెడీ అయింది. చైతన్య రావు, బ్రహ్మానందం, తరుణ్ బాస్కర్, ప్రధాన పాత్రల్లో నటించగా తరుణ్ భాస్కరే నిర్మాతగా, దర్శకుడిగా వ్యవహరించాడు. క్రైం, కామెడీ జోనర్లో వచ్చిన ఈ సినిమాలో కామెడీ టైమింగ్ బాగానే వర్కౌట్ అయినా ఎందుకనో 'ఈ నగరానికి ఏమైంది' సినిమా స్థాయిలో జనాలకు కనెక్ట్ కాలేకపోయింది. తక్కువ బడ్జెట్ తో రూపొందిన ఈ సినిమా దాదాపు రూ.20 కోట్లకు వరకు కలెక్ట్ చేసి పర్వాలేదనిపించింది.

## డబుల్ ఇస్మార్ట్ లుక్స్ అదుర్స్




టాలీవుడ్ ఎనర్జిటిక్ యాక్టర్ రామ్ పోతినేని, డాషింగ్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్ కాంబినేషన్‌లో తెరకెక్కిన చిత్రం ఇస్మార్ట్ శంకర్. ఈ చిత్రానికి సీక్వెల్‌గా హై ఆక్టేన్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న చిత్రం డబుల్ ఇస్మార్ట్ . ఈ చిత్రాన్ని పూరీ కనెక్ట్స్ బ్యానర్ నిర్మిస్తోంది. థియేటర్లలో ఉస్తాద్ రామ్, డాషింగ్ డైరెక్టర్ పూరీ జగన్నాథ్ డబుల్ మాస్ మ్యాడ్‌నెస్‌ను ఎక్స్‌పీరియన్స్ చేసేందుకు కౌంట్‌డౌన్ షురూ అయింది. మార్చి 8న ప్రపంచవ్యాప్తంగా తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో గ్రాండ్ విడుదల చేస్తున్నట్టు ప్రకటిస్తూ.. కొత్త పోస్టర్ విడుదల చేశారు. రామ్ స్టైలిష్ గాగుల్స్ పెట్టుకొని గన్స్ మధ్య స్టైలిష్‌గా డబుల్ ఇస్మార్ట్ లుక్‌ను విడుదల చేయగా.. నెట్టింట ట్రెండింగ్ అవుతోంది. వంద రోజుల్లో థియేటర్లలో సందడి అంటూ లాంఛ్ చేసిన లుక్ వైరల్ అవుతోంది. డబుల్ ఇస్మార్ట్‌లో బాలీవుడ్ స్టార్ యాక్టర్ సంజయ్ దత్ విలన్‌గా నటిస్తున్నాడు. ఫస్ట్ పార్టుకు అదిరిపోయే మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందించిన మెలోడీ బ్రహ్మ మణిశర్మ సీక్వెల్‌కు కూడా పనిచేస్తున్నట్టు .. పూరీ, మణిశర్మ, చార్మీతో కలిసి దిగిన ఫొటోను షేర్ చేస్తూ ఈ విషయాన్ని తెలియజేశాడు రామ్. ఇస్మార్ట్ శంకర్‌ను మించిన ఆల్బమ్ రెడీ అవుతుందని ఈ స్టిల్‌తో క్లారిటీ ఇచ్చేశాడు. ఇస్మార్ట్ ఈజ్ బ్యాక్.. ఈ సారి డబుల్ ఇంపాక్ట్.. అంటూ ఇప్పటికే శక్తిమంతమైన త్రిశూలం.. బ్యాక్ డ్రాప్‌లో మంటలు కనిపిస్తున్న లుక్‌ను విడుదల చేయగా.. ఈ సారి డబుల్ ఎంటర్‌టైన్ మెంట్ పక్కా అని చెప్పేస్తున్నాడు పూరీ జగన్నాథ్. రామ్ మరోవైపు పాపులర్ బ్యానర్ పీపుల్ మీడియా ఫ్యాక్టరీలో కూడా ఓ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చాడని తెలిసిందే. ఈ చిత్రాన్ని సప్త సాగరాలు ధాటి ఫేం రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా మెరువబోతుందని వార్తలు వస్తుండగా.. దీనిపై మేకర్స్ నుంచి క్లారిటీ రావాల్సి ఉంది.

## అభిమాని బైకును క్లీన్ చేసిన ధోని



ఇండియన్ మాజీ క్రికెటర్ మహేంద్ర సింగ్ ధోని గురించి ప్రత్యేక పరిచయాలు అవసరం లేదు.. క్రికెట్ కు రిటైర్డ్ అయిన తర్వాత జనాల్లో మంచి క్రేజ్ ను సంపాదించుకుంటున్నాడు.. ఒకవైపు సినిమాలను కూడా నిర్మిస్తూనే మరో వైపు సోషల్ మీడియాలో అభిమానులను పలకరిస్తూ ఉంటాడు.. ఎప్పటికప్పుడు కొత్త ఫోటోలను, వీడియోలను అభిమానులతో పంచుకుంటాడు.. అంత పెద్ద స్టార్ హెూదాలో ఉన్నా కూడా అభిమానులతో సొంతం మనిషిలాగ కలిసిపోతాడు.. ఇదిలా ఉండగా ధోనికి సంబందించిన ఓ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతుంది.. ధోనికి అభిమానికి మధ్య జరిగిన ఓ సంభాషణ వీడియో సోషల్ మీడియా తెగ వైరల్ అవుతుంది.. ఆ వైరల్ అవుతున్న వీడియోలో ఓ అభిమాని తన బైక్ పై ఆటోగ్రాఫ్ కావాలని అడిగాడు.. బైక్‌పై సంతకం చేసే ముందు ధోని తన టీ-షర్ట్‌తో ఎలా తుడిచిపెట్టాడు అనేది వీడియోలో చూపబడింది. ఈ సంజ్ఞ చాలా మంది హృదయాలను కదిలించింది.. సోషల్ మీడియాలో ఈ వీడియో ట్రెండ్ అవ్వడంతో ఆయన ఫ్యాన్స్ తో పాటుగా నెటిజన్స్ కూడా ఫిదా అవుతున్నారు.. ధోనీ సర్ ప్రకాష్ సోదరుడు తన ట్రయంఫ్ రాకెట్ 3%=%పై ఆటోగ్రాఫ్ ఇవ్వడం ద్వారా ఆనందపరిచాడు' అని సుమీత్ కుమార్ బజాజ్ వీడియోను షేర్ చేస్తూ రాశాడు. ధోని బైక్‌పై తన సంతకాన్ని ఎక్కడ ఇవ్వాలో గుర్తించడాన్ని చూపించడానికి క్లిప్ తెరవబడింది. అతను సంతకం చేసే ముందు, అతను దానిని తన టీ-షర్టుతో శుభ్రం చేస్తాడు.అంతేకాకుండా, అతను బైక్‌పై కూర్చొని స్టార్ట్ చెయ్యడం కూడా వీడియో చూడవచ్చు.. ఈ పోస్ట్ రెండు రోజుల క్రితం షేర్ చేయబడింది. అప్‌లోడ్ చేసినప్పటి నుండి, ఇది 14 మిలియన్లకు పైగా వీక్షణలను పొందింది. షేర్‌కి అనేక లైక్‌లు మరియు కామెంట్‌లు కూడా ఉన్నాయి.. మొత్తానికి ధోని ఫ్యాన్స్ ఈ వీడియోని మరింత ట్రెండ్ చేస్తున్నారు..

## దక్షిణాఫ్రికా టూర్ నుంచి కోహ్లీ ఔట్



డిసెంబరు 10 నుంచి భారత్ దక్షిణాఫ్రికా పర్యటన ప్రారంభం కానుంది. కానీ, అంతకు ముందు ఈ టూర్‌లో టీ20 ఇంటర్నేషనల్, వన్డే ఆడేందుకు విరాట్ కోహ్లీ నిరాకరించాడనే వినిపిస్తున్నాయి. విరాట్ కోహ్లీ తన నిర్ణయాన్ని బీసీసీఐకి ఇప్పటికే తెలియజేసినట్లు సమాచారం. దక్షిణాఫ్రికా పర్యటనలో భారత్ మొత్తం 8 మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఇందులో కాకుండా, 2 టెస్ట్ మ్యాచ్‌లు ఉంటాయి. ఇప్పటివరకు అందిన సమాచారం ప్రకారం విరాట్ కోహ్లీ సౌతాఫ్రికా టూర్‌లో వన్డే, టీ20 ఆడబోవడం లేదని, వైట్ బాల్ సిరీస్‌కు విరామం ఇవ్వడమే దీనికి కారణమని తెలుస్తోంది. అయితే, టెస్టు సిరీస్‌లో ఆడతాడా? అనే ప్రశ్నపై ఇంకా సస్పెన్స్ కొనసాగుతోంది. ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నివేదిక ప్రకారం, దక్షిణాఫ్రికా పర్యటనలో రెండు టెస్ట్ మ్యాచ్‌లలో విరాట్ ఆడటం చూడొచ్చని తెలుస్తోంది. దక్షిణాఫ్రికా పర్యటనకు భారత జట్టును ఇంకా ఎంపిక చేయలేదు. దీనికి సంబంధించి అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ త్వరలో సమావేశం కానుంది. ఆ సమావేశానికి ముందు, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ సెలక్షన్ కమిటీ గురించి ఓ వార్తలను ప్రచురించింది. వైట్ బాల్ సిరీస్ నుం,ఇ విరామం తీసుకోవాలని కోహ్లీ బీసీసీఐ, సెలెక్టర్లకు చెప్పినట్లు పేర్కొంది. అలాగే, అతను రెడ్ బాల్ క్రికెట్‌లో ఆడతానని బీసీసీఐకి చెప్పినట్లు తెలుస్తోంది. దీన్ని బట్టి అతను దక్షిణాఫ్రికా పర్యటనలో టెస్టు సిరీస్‌లో ఆడగలడని స్పష్టమవుతోంది. దక్షిణాఫ్రికా పర్యటనలో భారత్ 2 టెస్టుల సిరీస్ ఆడాల్సి ఉంది. డిసెంబర్ 26 నుంచి సెంచూరియన్‌లో తొలి టెస్టు జరగనుంది. కాగా, రెండో టెస్టు 2024 జనవరి 3 నుంచి కేప్‌టౌన్‌లో జరగనుంది. 2023 ప్రపంచకప్‌లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా విరాట్ కోహ్లీ నిలిచాడు. అతను 11 ఇన్నింగ్స్‌ల్లో 765 పరుగులు చేశాడు. ప్రస్తుతం కోహ్లీ లండన్‌లో హాలిడేలో ఉన్నాడు. అంతకుముందు, అతను ఈ ఏడాది సెప్టెంబర్‌లో వైట్ బాల్ క్రికెట్‌కు విరామం తీసుకున్నాడు.

## కోచ్‌గా రాహుల్ ద్రవిడ్‌ను కొనసాగిస్తున్నాం



ప్రతిష్ఠాత్మక వన్డే ప్రపంచకప్ ఫైనల్ లో పరాజయం తర్వాత టీమిండియా ప్రధాన కోచ్ రాహుల్ ద్రవిడ్ ను కొనసాగిస్తారా? లేదా మారుస్తారా? అనే సందేహాలు వ్యక్తమయ్యాయి. ద్రవిడ్ స్థానంలో హైదరాబాదీ ప్లేయర్ వీవీఎస్ లక్ష్మణ్‌ను కోచ్‌గా తీసుకుంటారని ఊహాగానాలు కూడా వచ్చాయి. ఈ రూమర్లన్నింటికి చెక్ పెడుతూ తాజాగా హెడ్ కోచ్ విషయంపై బీసీసీఐ అధికారిక ప్రకటన వెలువరించింది. భారత జట్టు ప్రధాన కోచ్‌గా రాహుల్ ద్రవిడ్‌ను కొనసాగిస్తున్నట్లు బీసీసీఐ తెలిపింది. దీంతో అతను ఇప్పుడు టీమిండియాతో కలిసి కలిసి దక్షిణాఫ్రికా పర్యటనకు వెళ్లనున్నాడు. మళ్లీ ప్రధాన కోచ్‌గా బాధ్యతలు చేపట్టడంపై రాహుల్ ద్రవిడ్ సంతోషం వ్యక్తం చేశాడు. తనపై నమ్మకం ఉంచిన బీసీసీఐకి కృతజ్ఞతలు తెలిపాడు. తన ప్రణాళికకు, విజన్‌కు బీసీసీఐ ఎప్పుడూ మద్దతు ఇస్తుందని రాహుల్ ద్రవిడ్ చెప్పాడు. తన కోసం ఎన్నో త్యాగాలు చేసిన కుటుంబ సభ్యులకు రాహుల్ ద్రవిడ్ కృతజ్ఞతలు తెలిపాడు. ప్రపంచకప్ తర్వాత తన ముందు కొత్త సవాళ్లు ఉన్నాయని, వాటిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నానని రాహుల్ ద్రవిడ్ తెలిపాడు. మరోవైపు బీసీసీఐ ప్రెసిడెంట్ రోజర్ బిన్నీ, సెక్రటరీ జై షా కూడా టీమ్ ఇండియాతో కలిసి ఉన్నందుకు రాహుల్ ద్రవిడ్‌కి ధన్యవాదాలు తెలిపారు. ద్రవిడ్ ప్రస్థానం అద్భుతమని జై షా అన్నాడు. ప్రపంచకప్‌లో టీమిండియా వరుసగా 10 మ్యాచ్‌లు గెలిచి తన సత్తాను నిరూపించుకుంది, ఇందులో రాహుల్ ద్రవిడ్ పాత్ర చాలా ఉంది. ఈ ప్రదర్శన కారణంగా రాహుల్ ద్రవిడ్ మళ్లీ ప్రధాన కోచ్ అయ్యే అర్హత సాధించాడని జై షా అన్నాడు. బీసీసీఐ అధ్యక్షుడు రాహుల్ ద్రవిడ్ ముందుకు వెళ్లేందుకు అన్ని విధాలా సాయం చేస్తామని స్పష్టం చేశారు. ప్రధాన కోచ్‌గా రాహుల్ ద్రవిడ్ కాంట్రాక్టును ఎంతకాలం పొడిగించారనేది వెల్లడికాకపోయినా అతని ముందు పెద్ద సవాల్ ఉందని బీసీసీఐ స్పష్టం చేసింది. టీ20 ప్రపంచ కప్ వచ్చే ఏడాది జూన్‌లో జరగనుంది. ఈ మెగా టోర్నీనే లక్ష్యంగా చేసుకుని ద్రవిడ్ తన ప్రణాళికలను అమలు చేయనున్నాడు.

## కెప్టెన్సీలో రాణించాలంటే

# విధేయత కూడా ఉండాలి



ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2024లో గుజరాత్ టైటాన్స్ కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ వ్యవహరించనున్నాడు. హార్దిక్ పాండ్యా గుజరాత్ జట్టును వీడి ముంబై ఇండియన్స్‌కు తిరిగి వచ్చినందున ఈ యువ ఆటగాడికి కీలక బాధ్యతలు అప్పగించారు. ఇప్పటికే ఆటగాడిగా తనను తాను నిరూపించుకున్న గిల్ కెప్టెన్సీ బాధ్యతలు స్వీకరించేందుకు కూడా సిద్ధమయ్యాడు. అయితే గుజరాత్ టైటాన్స్ కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన వెంటనే శుభ్‌మన్ గిల్ చేసిన కొన్ని కామెంట్స్ దుమారం రేపుతున్నాయి. ముఖ్యంగా ఇటీవలే గుజరాత్ కు గుడ్ బై చెప్పిన హార్దిక్ పాండ్యానే ఉద్దేశించే గిల్ ఇలా మాట్లాడాడంటూ కొందరు కామెంట్స్ చేస్తున్నారు. కెప్టెన్సీ స్వీకరించిన తర్వాత గిల్ వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోను గుజరాత్ టైటాన్స్ తమ అధికారిక ట్విట్టర్ ఖాతాలో షేర్ చేసింది. అందులో గిల్ లాయల్టీ (విధేయత) అంటూ మాట్లాడాడు. దీంతో ఒక్కసారిగా హార్దిక్ పాండ్యా మళ్లీ వార్తల్లోకి వచ్చాడు. కెప్టెన్సీ అనేక రకాల బాధ్యతలతో కూడి ఉంటుందని మనకు తెలుసు, అందులో కష్టపడి పనిచేయడం ముఖ్యమని, అందులో విధేయత కూడా ఒకటని గిల్ అన్నాడు. గిల్ లాయల్టీ అనే పదాన్ని ఉపయోగించిన వెంటనే నెటిజన్లు హార్దిక్ పాండ్యాను ట్రోల్ చేయడం ప్రారంభించారు. గత రెండు సీజన్లలో గుజరాత్ కెప్టెన్‌గా ఉన్న అతను అకస్మాత్తుగా ముంబై ఇండియన్స్ జట్టులో చేరిన సంగతి తెలిసిందే. ఐపీఎల్‌లో ఆడటం ప్రతి ఆటగాడి కల. నాకు 7-8 ఏళ్ల వయసు ఉన్నప్పుడు ఐపీఎల్ మొదలైంది. ఇప్పుడు ఆ లీగ్‌లో ఒక జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించడం పెద్ద విషయం. కెప్టెన్సీకి క్రమశిక్షణ, కృషి, విధేయత చాలా అవసరం. నేను చాలా మంది పెద్ద కెప్టెన్ల జట్లలో ఆడాను. వారి నుంచి నేను నేర్చుకున్నది ఐపీఎల్‌లో నాకు ఉపయోగపడుతుందనుకుంటున్నా' అని గిల్ చెప్పుకొచ్చాడు.

## ఇషాన్ కిషన్ తప్పిదమే

# ఆస్ట్రేలియాకు కలిసొచ్చింది!



గువాహటి వేదికగా మంగళవారం జరిగిన మూడో టీ20లో భారత్ 5 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియా చేతిలో ఓడింది. కచ్చితంగా గెలుస్తుందనుకున్న భారత్.. గ్లెన్ మ్యాక్స్‌వెల్ విధ్వంసంతో చివరి బంతికి ఓడాల్సి వచ్చింది. ఇటీవలే ముగిసిన ప్రపంచకప్‌లో అఫ్గాన్‌పై డబుల్ సెంచరీని గుర్తుకు తెచ్చేలా మూడో టీ20లో మ్యాక్స్‌వెల్ అజేయ శతకంతో విరుచుకుపడ్డాడు. చివరి రెండు ఓవర్లలో బౌండరీలు, సిక్సులు బాది ఊహించని విజయాన్ని ఆస్ట్రేలియాకు అందించాడు. అయితే వికెట్ కీపర్ ఇషాన్ కిషన్ చేసిన ఓ తప్పిదం ఆసీస్‌కు కలిసొచ్చింది. ఆస్ట్రేలియా 9 బంతుల్లో 33 పరుగులు చేయాల్సి ఉంది. అక్షర్ పటేల్ వేసిన 19వ ఓవర్ నాలుగో బంతిని మాథ్యూ వేడ్ ముందుకు వచ్చి ఆడబోయాడు. బంతిని అందుకున్న ఇషాన్ కిషన్ స్టంపింగ్ చేసి అప్పీల్ చేశాడు. రిప్లేలో వేడ్ నాటౌట్‌గా తేలాడు. అయితే బంతిని అందుకునే క్రమంలో ఇషాన్ గ్లోవ్స్.. స్టంప్స్ కన్నా ముందుకు రావడంతో అంపైర్ ఆ బంతిని నోబాల్‌గా ప్రకటించాడు. ఫ్రీహిట్‌ను సద్వినియోగం చేసుకున్న వేడ్.. భారీ సిక్స్ కొట్టాడు. అదే ఓవర్ ఆఖరి బంతికి బైస్ రూపంలో నాలుగు పరుగులు వచ్చాయి. ఇక ఇన్నింగ్స్ చివరి ఓవర్లో ఆస్ట్రేలియా విజయానికి 21 పరుగులు అవసరం కాగా.. గ్లెన్ మ్యాక్స్‌వెల్ బౌండరీల మోత మోగించాడు. ఐసీసీ నిబంధనల ప్రకారం.. బౌలర్ బంతి వేసిన తర్వాత వికెట్ కీపర్ స్టంప్స్ వెనకాలే బంతిని అందుకోవాలి. గ్లవ్‌లో కొంచెం భాగం ముందుకు వచ్చినా.. దాన్ని అంపైర్ నోబాల్‌గా ప్రకటిస్తాడు. ఇషాన్ కిషన్ స్టంపింగ్ కోసం అప్పీల్ చేయకపోతే.. ఆస్ట్రేలియాకు ఫ్రీహిట్ అవకాశం వచ్చేదే కాదు. అప్పుడు మాథ్యూ వేడ్‌కు సిక్స్ బాదే అవకాశం లేకుండా ఉండేది. కిషన్ తప్పిదమే ఆస్ట్రేలియాకు కలిసొచ్చింది.

## మ్యాక్స్‌వెల్ ఊచకోత కారణంగా

# ఆస్ట్రేలియా గట్టెక్కింది

స్ట్రేలియాతో ఐదు టీ20ల సిరీస్‌లో భారత్ వరుస విజయాలకు బ్రేక్ పడింది. సిరీస్‌లో నిలవాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియా అనూహ్య విజయం సాధించింది. అసాధారణ బ్యాటింగ్‌తో కొండత లక్ష్యాన్ని ఛేధించిమన ఆసీస్.. చిరస్మరణీయ విజయాన్ని అందుకుంది. హార్డ్ హిట్టర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ (104 నాటౌట్‌బీ 48 బంతుల్లో 8 ఫోర్లు, 8 సిక్సర్స్) సూపర్ సెంచరీతో చెలరేగడంతో ఆసీస్ 5 వికెట్ల తేడాతో గెలుపొందింది. చివరి రెండు ఓవర్లలో మ్యాక్స్‌వెల్ ఊచకోత కారణంగా ఆస్ట్రేలియా గట్టెక్కింది. 223 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన ఆస్ట్రేలియాకు సరైన ఆరంభం దక్కలేదు. ట్రవిస్ హెడ్ (35), ఆరోన్ హార్డీ (16), జోష్ ఇంగ్లిస్ (10), మార్కస్ స్టోయినిస్ (17) తక్కువ స్కోర్లకే పెవిలియన్ చేరారు. ఈ సమయంలో గ్లెన్ మ్యాక్స్‌వెల్ మాథ్యూ వేడ్ (28 నాటౌట్‌బీ 16 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్) సహకారంతో చెలరేగాడు. ఆసీస్ విజయానికి చివరి రెండు ఓవర్లలో 43 పరుగులు అవసరం కావడంతో.. భారత గెలుపు లాంఛనమే అనుకున్నారంతా. అయితే మ్యాక్సీ 19వ ఓవర్‌లో 22 పరుగులు, 20వ ఓవర్‌లో 23 పరుగులు చేశాడు. ఆస్ట్రేలియాకు విజయాన్ని అందించడమే కాకుండా.. ఫాస్టెస్ట్ సెంచరీ చేశాడు. గ్లెన్ మ్యాక్స్‌వెల్ 47 బంతుల్లోనే సెంచరీ బాదాడు. దాంతో ఆస్ట్రేలియా తరఫున పొట్టి క్రికెట్‌లో ఫాస్టెస్ట్ సెంచరీ రికార్డును సమం చేశాడు. అంతకుముందు ఆరోన్ ఫించ్, జోష్ ఇంగ్లిస్ కూడా 47 బంతుల్లోనే సెంచరీలు చేశారు. ఆసీస్ తరఫున టీ20ల్లో టాప్ 5 ఫాస్టెస్ట్ శతకాల్లో.. మ్యాక్స్‌వెల్‌వే మూడు ఉండటం విశేషం. ఇదివరకు 49 బంతుల్లో, 50 బంతుల్లో టీ20 సెంచరీలు బాదాడు. భారత పర్యటనలో మ్యాక్స్‌వెల్ మూడు శతకాలు బాదాడు. వరల్డ్‌కప్ 2023లో రెండు శతకాలు చేసిన విషయం తెలిసిందే.

